డిసెంబర్ - 2022

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పత్తునేహు | కొడవటికంటి | 03 |
| చెవిటి మాలోకం | ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 07 |
| మరియ | హన్నాకృప డెస్క్ | 09 |
| సువర్తమానము | హన్నాకృప డెస్క్ | 10 |
| గెరూతు కింహాము | ఎ.ఎన్.ఆర్.జక్కం | 13 |
| క్రిస్మస్ బహుమానము | చిన్నపిల్లల పేజి | 17 |
| కృపాదానం | కొడవటికంటి | 19 |
| దేవుని ప్రేమించుదాం | హన్నాకృప డెస్క్ | 21 |
| దేవుడు - సిరి | హన్నాకృప డెస్క్ | 22 |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 23 |



**గౌరవ సంపాదకులు :**

**కె. సామ్యేల్ రాజేంద్ర**

**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. **350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole


IFSC Code : SBIN0000890





| సీరియల్ నంబరు | |
|---|---|

# సంపాదకీయం.....



హన్నాకృప పాఠకులకు కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర నమస్కారములు.

క్రైస్తవులందరూ అత్యంత ఘనంగా జరుపుకునే క్రిస్మస్ పండుగ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా వచ్చేసింది. ఏ మాత్రం మార్పు లేదు, అదే తంతు, కొత్తబట్టలు, పిండివంటలు, బిరియానీలు, అంతా బిజీబిజీ. యేసు పుట్టిన రోజు పండుగ యేసు మన హృదయంలో, మన ఇంట్లో లేకుండానే జరుపుకోవడం షరా మామూలే. ప్రపంచంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అంతకు ముందెన్నడూ చూడని కరోనాలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నాము. ప్రస్తుతం ప్రపంచమంతా ఆర్థికమాంద్యం వెంటాడు తుంది. ఇటీవలి కాలంలో ప్రపంచంలో చాలా మార్పులు చూస్తూనే ఉన్నాము. ప్రతి మార్పు యేసుక్రీస్తు రెండవ రాకడ సమీపంగా ఉన్నదని తెలియజేస్తుంది. మన దేశంలో కూడా గత కొంతకాలంగా తీవ్రమైన అలజడి, దేవుని సంఘాలలో అల్లర్లు, సేవకులపై తీవ్ర విమర్శలు, దేవుని ప్రజలకు శ్రమలు... సమాజంలో జరుగుతున్న ఈ నూతన పరిణామాలు దేవుని రెండవ రాకడకు ముంగుర్తు. మనం ఎంత బిజీగా ఉన్నా, ఎన్ని పండుగలు చేసుకున్నా, దేవుని ప్రవచనాల నెరవేర్పులను నిశితంగా గమనిస్తూ, దేవుని రెండవ రాకడకు మనల్ని మనం సిద్ధం చేసుకోవాలని కోరుతున్నాను. ప్రతి సంవత్సరం ఘనంగా క్రిస్మస్ పండుగ జరుపుకోవడంలో తప్పు లేదు కానీ, యేసుక్రీస్తు తిరిగి వచ్చినప్పుడు ఆయనతో పాటు మనం వెళ్ళడానికి మనల్ని మనం సిద్ధం చేసుకోకపోతే ఎన్ని క్రిస్మస్ పండుగలు చేసుకున్నా ప్రయోజనం లేదు.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాను. మీరు ఫోన్‌పే ద్వారా చందా పంపాలనుకుంటే పత్రికలో 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును. మీరు ఫోన్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర, ఎడిటర్

K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole
**A/c No. 10957294340**

సీరియల్

# జఫ్నత్పనేహు
(యోసేపు జీవితచరిత్ర)

– కొడవటికంటి

ఆషేరు, లేవి, యూదా ప్రక్కకి వచ్చారు. తన చేతిలో నీళ్ళ తిత్తి మూత ఉన్నది. చేతులు కడుక్కోమన్నట్లుగా చూశాడు. యూదా వెనక్కు తిరిగి చేతులు చాపాడు. ఆషేరు నీళ్ళు కొద్దిగా పోస్తుంటే ముఖం, చేతులు కడుక్కున్నాడు యూదా. నఫ్తాలి యూదా ముఖంలోకి చూడడం లేదు. రొట్టెలు, మాంసం యూదా చేతికి అందించారు. ఎవరూ మాట్లాడడం లేదు. అయితే యూదా తప్ప ఎవరూ దుః ఖంగా లేరు. ముందు ఎదుర్కొనవలసిన పరిస్థితికి సిద్ధపడుతు న్నట్లుగా ఉన్నారు. అందరూ ఆలోచిస్తున్నారు. కాని అందరూ ఆకలిగా ఉన్నందున గబగబా తింటున్నారు. యూదాకు ఏమి సహించకపోయినా వారిలో ఒకనిగా కనపడాలని ఏదో తింటున్నాను అనిపిస్తున్నాడు.

యూదా తలెత్తి చూశాడు – రూబేను వస్తున్నాడేమో నని! కాని ఆ కొండ పైగా దుమ్ము ఆకాశంలోకి లేవటం కనిపించింది. 'ఇదేమిటి ఈ ఇష్మాయేలీయులు ఇంతమంది ఈ రోజు ఐగుప్తు ప్రయాణం చేస్తున్నారు? వారి ఒంటెల కాళ్ళు లేపిన ఇసుక ఈ అడవి చెట్ల మీద నిలిచిపోతుంది.

రూబేను జాడ ఇంకా కనబడలేదు. ఒకవేళ యోసేపు ను ఈ ఇష్మాయేలీయులకు అమ్మివేస్తే – వీరూ సున్నతి చేయబడినవారే! పితరుడైనా అబ్రాహాము వంశమే కదా! ఐగుప్తులో ఉండే భద్రత యోసేపుకు ఇక్కడ దొరకదు.

ఈరోజు ఏదో విధంగా యోసేపును కాపాడినా, ముందు సంవత్సరాలలో – ఒకసారి యోసేపును సగం చంపిన వీరు, ఈ సారి ఒంటరిగా చూసి పూర్తిగా చంపవచ్చు. యోసేపు కొంతకాలం ఐగుప్తులో ఉంటే పెద్దవాడైన తర్వాత ఏదో ఒక రోజు ఇంటికి వస్తాడు. ఔను! యోసేపుకు ఐగుప్తే రక్షణ ప్రదేశం. ఔను తన తాత, తండ్రి, పశువులు పరివారం అంతా కరువులో రక్షించబడినది ఈ ఐగుప్తులోనే యోసేపుకు భద్రత అనుకుంటూ గొంతు సవరించుకున్నాడు. చేతిలో మిగిలిన ఆహారం నఫ్తాలి చేతిలో పెట్టి మంచి నీళ్ళు తాగి లేచి నిలబడ్డాడు.

గొప్ప ఒంటెల సమూహం! ఇష్మాయేలీయుల వ్యాపారులు, వారి బానిసలు ఐగుప్తు మార్గాన వస్తున్నారు. 'బహుశా వీరు గుగ్గిలము, మస్తకి, బోళములతో, గిలాదు నుండి వస్తూ ఉంచవచ్చు. యోసేపు ముఖం చూచిన వారు ఎవరైనా అతనిని ప్రేమిస్తారు. కనుక ఈ ఇష్మాయేలీయులు తప్పక యోసేపును కొనుక్కుంటారు. మరలా ఐగుప్తులో అమ్ముతారు. కనుక అతనిని దయగా చూసి ఐగుప్తులో మంచి ధరకి అమ్ముకోవటానికి మంచి ఆహారం, మంచి వస్త్రాలు ఇస్తారు. వెండి రూకలు ఇస్తే ఈ దాసీ కుమారులకు ప్రీతి కనుక వారు యోసేపును అమ్మటానికి ఒప్పుకొని అతనిని గుంటలో నుండి బయటకు తీస్తారు' అనుకున్నాడు.

తన దగ్గర కూర్చున్న నలుగురు సహోదరులు భోజనం చేయటంలో నిమగ్నమై ఉన్నారు. ఇప్పుడు వెండి రూకలు యోసేపు ప్రాణాన్ని శాశ్వతంగా కాపాడుతాయి అనుకుంటూ గాదుతో "ఇందాక ఇటు వెళ్ళిన ఇష్మాయేలీయుల వద్ద నువ్వు గోధుమపిండి ఎందుకు కొని తేలేదు?" అడిగాడు.

"వారు వెండికే గాని, మరి గొఱ్ఱెపిల్ల మారకానికి పిండి ఇవ్వమన్నారు" అన్నాడు గాదు. "అందువల్లనే మన దగ్గర కొంత వెండి ఎప్పుడూ ఉంచుకుంటే ఇటువంటి అవసరా లకు పనికి వస్తుంది" అన్నాడు యూదా. "ఆ వెండి ఈ ఇష్మాయేలీయుల వద్ద చాలా ఉంటుంది. మనం ఏదైనా వారికి వెండికి బదులు అమ్ముదాము" అని యూదా తన తమ్ముళ్ళతో అన్నాడు.

"అవును, మన దగ్గర ఏమి ఉంది? వాళ్ళ దగ్గర లేనివి మన దగ్గర కొని ఐగుప్తులో అమ్ముతారు. మన యోసేపు చనిపోలేదు కదా! వాడ్ని అమ్మివేస్తే? ఇటు మనకు వెండి దొరుకుతుంది. అటు హత్యాపరాధం నుండి విముక్తులమ

వుతాము. మనము మన సహోదరుని చంపి, వాని మరణ ము దాచిపెట్టినందు వలన ప్రయోజనమేమి? ఈ ఇష్మాయే లీయులకు వానిని అమ్మి వేయుదము రండి" అంటూ భోజనం వద్ద నుండి లేచాడు.

ఇప్పుడు తనే ఈ కార్యక్రమ మంతటికి పెద్ద అని, ఇక ఈ నిర్ణయానికి తిరుగులేదు అని, తనని ఎదిరించే సాహసం ఎవ్వరూ చెయ్యలేరని ఆ మాటలలో స్ఫురిస్తుంది. ఆ గుంటవద్దకు యూదా గబగబా నడుస్తుంటే మిగిలిన నలుగురూ అతనిని వెంబడించారు.

ఐగుప్తు వెళ్తున్న ఇష్మాయేలీయులు ఇంకా దగ్గర అవుతున్నారు. యూదా తలెత్తి అటు చూశాడు. "ఈ ఇష్మాయేలీయులకు అమ్మివేయుటకు వానిని బయటకు లాగుదాము" అంటూ, గాదుని మంద యొద్దకు వెళ్ళి పెద్ద తాడు ఒకటి తీసుకొని రమ్మని పంపించాడు. ఇప్పుడు నలుగురూ ఈ అమ్మివేసే కార్యక్రమానికి అంగీకారం చూపుతున్నట్లుగా గ్రహించాడు యూదా.

ప్రేమగా లోపలికి వంగి చూసి "వాడు మన సహోద రుడు, మన రక్త సంబంధి కదా! వానికి హాని ఏమియు చేయవద్దు" అని చెప్పాడు. అందుకతని సహోదరులందరూ సమ్మతించారు. గాదు తాడు తీసుకొని వచ్చాడు.

యూదా బావిలోకి చూస్తూ "యోసే!" అని అన్నాడు. పై నుంచి వచ్చేమాటలు వింటున్న యోసేపుకు కొంచెం ఊరట కల్గింది. ఇప్పుడు తన వీపు మండుతున్నట్లు తెలిసింది. ప్రాణం మీద ఆశ పుట్టుకొచ్చింది. "ఈ తాడు గట్టిగా పట్టుకో, మేము నలుగురము పైకి లాగుతాము" అంటుంటే, యోసేపు మీదకు తాడు వచ్చింది. దానిని తన నడుము చుట్టూ కట్టుకొని రెండు చేతులతో పట్టుకున్నాడు.

బయటకు యోసేపు రాగానే యూదా అతని శరీరాన్ని పరీక్షించాడు. నుదురు మీద చిన్న దెబ్బ ఉంది. మోచేతులు, అరచేతుల మీద, వీపు మీద చర్మం చీలిపోయింది. గాదుని పిలిచి మందవద్దకు వెళ్ళి నూనె తీసుకొని రమ్మన్నాడు. గాదు కదల్లేదు. "ఈ గాయాలు ఇంకా చిత్రగా ఉంటే వీడిని ఎవరు కొంటారు? వాళ్ళు దగ్గరికి రాకముందే ఒలీవనూనె పూస్తే బాగుంటుంది. తొందరగా పోయిరా!" అని మంద లింపుగా అరిచాడు. గాదు మందవైపు కదిలాడు. రూబేను వస్తున్నాడేమోనని పడమరవైపుగా చూశాడు. ఇంతలో ఇష్మాయేలీయులు దగ్గరికి వచ్చారు. నఫ్తాలి, ఆషేరు వారితో ఏదో మాట్లాడుతున్నారు. దాదాపుగా అరవై ఒంటెలు ఉన్నాయి. ఇరవై మంది వ్యాపారస్తులు, నలభైమంది బానిసలు ఉన్నారు. మీరు ఇంకా నలభైరోజులు ప్రయాణం చేస్తేనే కాని ఐగుప్తు చేరరు. ఇద్దరు వ్యాపారస్తులు మాత్రం వారి ఒంటెలను ఆపారు. మిగిలిన వాళ్ళు తరలిపోతున్నారు. యూదాకి అర్ధమైంది బేరం కుదిరిందని. ఇప్పుడు ఆ ఇద్దరు ఇష్మాయేలీయులు, వారితో ఇద్దరు కూషు దేశీయులు యూదా దగ్గరకు వస్తున్నారు. వారిని కలుసుకోవటానికి గాదు, దాను ఎదురువెళ్ళారు.

ఈ సమయం కోసమే ఎదురుచూస్తున్న యూదా – తమ్ముణ్ని ముద్దుపెట్టుకోగా యోసేపు ఏడవటం మొదలు పెట్టాడు. "నువ్వు ఇప్పుడు వెళ్ళటమే మంచిది తమ్ముడూ! మేమెవరం లేనప్పుడు వాళ్ళు నిన్ను చంపేస్తారు. నీవు చచ్చిపోవటం కంటే బానిసగా కొంతకాలం బ్రతికి వీలు చూసుకొని హెబ్రోను వచ్చెయ్యవచ్చు. కొన్ని రోజులు దూరం గా ఉండక తప్పదు" అని ఓదారుస్తుంటే, యోసేపు ఇవేమి వినిపించుకోకుండా హృదయవిదారకంగా ఏడుస్తున్నాడు.

చిన్నతనంనుండి కంట తడిపెట్టకుండా పెరిగాడు. చిన్ననాటి నుండి నేటివరకు బయటకు రావలసిన కన్నీరం తా ఈరోజు బయటకు వస్తుందా అనిపిస్తుంది. అసలు ఈరోజు కోసమే ఈ కన్నీరంతా దాచినట్లుగా ఉంది. ఈ పరిస్థితిని యూదా భరించలేకుండా ఉన్నాడు. చిన్నప్పటి నుంచి ఎన్నడూ ఊహించని స్థితిలో యోసేపును చూశాడు. యూదా కళ్ళవెంట నీరు చూసి యోసేపు కొంచెంసేపు ఏడవటం ఆపేసి అన్నని అలాగే చూస్తుండిపోయాడు.

ఇంతలో దాను, నఫ్తాలి వచ్చి "ఇరవై రూకలకంటే ఎక్కువ ఇవ్వమని చెప్తున్నారు. కూషు దేశస్తులకైతే ఐగుప్తులో ధర పలుకుతుంది గాని హెబ్రీయులంటే ఐగుప్తీయులకు హేయమట. అందువల్ల ఇరవై వెండి రూకలు మాత్రమే ఇస్తామని అంటున్నారు" అని, యోసేపు చెయ్యి పట్టుకొని ఆ ఇష్మాయేలీయుల యొద్దకు తీసుకుని పోతుంటే, యూదా

అది చూడలేక రూబేను వెళ్ళిన వైపుగా వేగంగా వెళ్ళిపోయాడు. ఒక్కసారైనా వెనక్కి తిరిగి చూడలేదు. యోసేపు యూదాని పిలిచి పిలిచి ఇక తన పిలుపు యూదాకి వినబడదని అనుకున్న తర్వాత పిలవటం మానేసి క్రింద కూలబడి ఏడవటం మొదలుపెట్టాడు.

ఇష్మాయేలీయులు వారిపెట్టె తెరచి ఇరవై వెండి నాణాలు లెక్క పెట్టటం యోసేపుకు వినబడుతుంది. నఫ్తాలి – ఇంకా అయిదు నాణాలైనా ఇవ్వమని అడుగుతున్నాడు. ఇష్మాయేలీయులకు సిరియాభాష వచ్చును. అందువల్ల నఫ్తాలి పద్దనరాములో ఉన్నప్పుడు నేర్చుకున్న సిరియా భాష ఇప్పుడు వారితో మాటాలాడటానికి అక్కరకు వచ్చింది. ఇనుప గొలుసుల శబ్దం విని యోసేపు తలెత్తి చూశాడు. అవి సంకెళ్ళు–మెడమీదుగా కాళ్ళకి తగిలిస్తున్నారు. ఇంతకంటే తను చచ్చిపోయినా బాగుండేది కదా! అని అనుకున్నాడు. ఇప్పుడు ఏడవటానికి కూడా శక్తి లేదు. సాయంకాలం నాల్గవ జాము అయింది. ఎండ తగ్గినా వేడి తగ్గలేదు. దాహం వేస్తుంది.

ఇష్మాయేలీయులు ఒంటెల దాకా యోసేపును నడిపించుకొని వెళ్ళారు. ఒంటెల దగ్గరకు వచ్చిన తర్వాత ఒక ఒంటెను మోకరింపచేసి ఎక్కమన్నారు. చిన్నప్పుడు పద్దనరాము నుండి వచ్చేటప్పుడు తన తల్లితో కలసి ఒంటె మీద షెకెము దాకా ప్రయాణం చేశాడు. తను ఒంటరిగా ఎప్పుడూ ఒంటె మీద ప్రయాణం చెయ్యలేదు. యోసేపు ఒంటె ఎక్కటం చూసి ఇంతకుముందు ఒంటె ఎక్కటం అలవాటు ఉంది' అనుకున్నారు వారు. ఎందుకంటే క్రొత్తవారు ఒంటె ఎక్కటం కష్టం. ఒకవేళ ఎక్కించినా ఒంటె పైకి లేచేటప్పుడు భయపడతారు. ఒంటె వీపు మీద కట్టబడిన జీను – అది లేచేటప్పుడు ఒకవైపుకు ఒరిగి, ఒక విసురు మీద పైకి విసిరి వేయబడినట్లుగా అనిపిస్తుంది.

ఈ మిద్యానీయులైన ఇష్మాయేలీయుల ఒంటెలు రెండు రకాలు ఉన్నాయి. కొన్ని పెద్దవి – ఇంత పెద్ద ఒంటెలను తనెప్పుడూ చూడలేదు. వాటిమీద వేసిన బరువు అపారం. కొన్ని మామూలు ఒంటెలు – వాటిలో కొన్ని ఆడవి. అవి కామాందులు ప్రయాణం చెయ్యడానికి. కొన్నిటిమీద అంబారీలున్నాయి. ఇవి ఇసుక తుఫానుల నుండి, ఎండ నుండి కాపాడటానికి, బానిసలు మాత్రం ఎంతదూరమైనా నడవాల్సిందే.

కొంతమంది బానిసలు సైనికుల్లాగా పూర్తి ఆయుధాలు ధరించి ఉన్నారు. మార్గంలో దొంగలను ఎదుర్కొనే శక్తి వీళ్ళకే ఉంది. అందరూ కూషు దేశస్తులే. వీరి చెవులు కుట్టబడి ఉన్నాయి. వారి చెవుల పోగులను బట్టి వారి యజమానిని గుర్తించవచ్చు. వీరందరూ దాదాపు ఐగుప్తు భాష ధారాళంగా మాట్లాడతారు. తన శరీరానికి గాయాలు ఉండటం వల్ల, అలసిపోయి ఉండడం వల్ల తనని బంధించియున్న రీతిగానే సరుకుల మూటలున్న ఒక ఒంటె మీద కూర్చోబెట్టారు. ఒక గంట ప్రయాణం తర్వాత తన శరీరం ఒంటె నడకకి వీలుగా తర్ఫీదు అయి అంత కష్టంగా అనిపించలేదు.

**(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra



# 'చెవిటి మాలోకం'



చెవిటి వాళ్ళతో మాట్లాడాలంటే చాలా విసుగొస్తది కదా! మనం ఒకటి చెప్తే వాళ్ళకి ఇంకోలా వినపడిద్ది. పెద్దగా అరిచి చెప్పాలి, లేదంటే సైగలు చేయాలి. సరే, పాపం నిజంగా చెవిటి వాళ్ళ అయితే వాళ్ళని చూచి జాలిపడాలి. మరి బాగా వినపడినా కూడా మాట వినని వాళ్ళని ఏమనాలి? పదే పదే చెప్పినా మాట వినని వాళ్ళని ఏమంటారు? వాడంతే, చెప్పినా వినిపించుకోడు, వాడికి చెప్పడమంటే చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లే అని అంటాము కదా! చెవిటివాడికి, చెప్పిన మాట వినని వాడికి పెద్ద తేడా ఏముంటది? వాడికి వినపడదు, వీడికి వినపడిద్ది కానీ చలనం ఉండదు. దేవుడి విషయంలో అందరి పరిస్థితి అంతే, దేవుని మాట వినే వాళ్ళే లేరు. అందరూ చెవిటి మాలోకాలే. ఆదాము దగ్గర్నుండి నేటి మానవుని వరకు ప్రతిఒక్కరూ మాట వినని చెవిటివాళ్ళే. 'నా మాట వినండి, నా మాట వినండి' అని దేవుడు ఎంత అరిచి మొత్తుకున్నా కూడా ఎవ్వరూ దేవుని మాట వినక పోవడానికి కారణం ఏంటి? వినపడకనా, దేవుడంటే లెక్కలేని తనమా? *'ఈ ప్రజలు కన్నులారా చూచి, చెవులారా విని, హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నా వలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది వారి చెవులు వినుటకు మందములైనవి' (మత్తయి 13:13-15).* కాబట్టి మనం దేవుని మాట వినకపోవడటానికి, వినిపించు కోకపోవడానికి కారణమేంటో దేవుడే చెప్పేశాడు. మన హృదయానికి క్రొవ్వుపట్టి ఆ క్రొవ్వు చెవుల్లోకి దూరటం వలన దేవుని మాట వినటం లేదు. మనకి ఊహ తెలిసినప్పటి నుండి చర్చీకి వెళ్ళి దేవుని వాక్యం వింటాము, టీ.వి.లో, సువార్త సభలలో, యూట్యూబ్‌లో ఎప్పుడు కావాలంటే అప్పుడు దేవుని వాక్యము వింటాము. అయినా కూడా మనం ఎందుకు మారటం లేదంటే, విన్న వాక్యం మన చెవుల్లోకే దూరుతుంది కానీ మన హృదయంలోకి పోకపోవడానికి మన హృదయానికి పట్టిన క్రొవ్వు అడ్డుపడుతుంది. కుంటి, గ్రుడ్డి, మూగ, చెవిటి వాళ్ళని చూసి మనం జాలి పడతాము. దేవుడు ఎందుకు వీళ్ళని ఇలా పుట్టించాడని బాధపడతాము. దేవుడు మనకి చెవులు ఇచ్చినందుకు మనమేమన్నా దేవుని మాట వింటు న్నామా? ఒకవేళ దేవుడు ఎవరినైనా చెవిటి వారిగా పుట్టించి వుంటే, వాళ్ళకి వినబడదు కాబట్టి వాక్యం వినకుండా, మనసు మారకుండా వుంటే వాళ్ళని క్షమించి పరలోకరాజ్యంలోకి అనుమతిస్తాడేమో కానీ, చెవులు బాగా వినబడుతూ, వాక్యం వింటూ మారని వాళ్ళకి మాత్రం పరలోకరాజ్యంలోకి ప్రవేశం ఉండదు. మన శరీరంలో ప్రతి అవయవం ఒకటి కంటే ఎక్కువ పనులు చేస్తాయి. కానీ, చెవులకు మాత్రం వినడమనే ఒక్కటే పని. ఒక్కటే చెవి వుంటే 'నాకు వినబడలేదని' చెప్తామనేమో రెండు చెవులిచ్చి *'కాగా మీరు నా మాట శ్రద్ధగా విని, నా నిబంధననుసరించి నడిచిన యెడల...' (నిర్గమ. 19:5)* అని పెద్దగా అరచి మైకులో చెప్పినా మనకు వినబడకపోతే మన కంటే **'చెవిటి మాలోకాలు'** ఇంకెవరూ ఉండరు. ***'మారండి, మారండి, మీరు మారకపోతే నాశనమై పోతారు'*** అని దేవుడు చెప్పే మాటలు మనకి వినబడటం లేదంటే దేవుని మాటలు వినబడనంత దూరం వెళ్ళిపోతున్నాము. దేవునికి ఇంకా ఇంకా దూరమైపోయి మన నాశనాన్ని మనం కొని తెచ్చుకోక ముందే హృదయానికి పట్టిన క్రొవ్వుని వాక్యం ద్వారా కరిగించు కుంటే చెవులు బాగా వినబడి శిక్ష నుండి తప్పించుకోగలం. **'వినుటకు చెవులు గలవాడు వినును గాక' (మార్కు 4:9).**

ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు
**9440217726**

సీరియల్



# నా చిత్తానుసారుడు

- కొడవటికంటి

(దావీదు జీవిత చరిత్ర)

తన జీవితంలో ఇటువంటి సంఘర్షణ ఎప్పుడూ జరగలేదు. తన దుఃఖానికి అమ్మ దగ్గర జవాబు ఉండేది. కాని ఈనాడు అమ్మ దగ్గరకు వెళ్ళిన తర్వాత దీర్ఘదర్శకుని దగ్గరికి వెళ్ళవచ్చు. అమ్మ ఇచ్చే మానసిక బలం ఎంత గొప్పది.

తన అన్నలు ఎంత శౌర్యవంతులైనా అమ్మ నాన్నకు ఏనాడు సంతోషం కలుగజేయలేదు. తాను కూడా ఏనాడు తన తండ్రికి గొప్ప కీర్తి తెచ్చే పనులు చేయలేదు. వారి దైనందిన జీవితంలో వారి మీద ఆధారపడిన వారినెవరిని వారు దూరం చేయలేదు.

ఎదురుగా అంత పెద్ద గడ్డం. ఎత్తైన విగ్రహం ఆయన చూపులు తన మీద ఉన్నట్లు కంటికి కనిపించినా ఆయన ఎవరితోనో మాట్లాడుచున్నట్లుగా అనిపించింది. తన కాళ్ళు కదలకుండా ఆగిపోయాయి. సమూయేలు వైపు చూస్తూ ఆగిపోయాయి. సమూయేలు ఎవరో చెబుతున్న మాటలు వింటున్నారు. దృష్టి తన మీదనే లగ్నమైన సంగతి అర్థమవుతున్నది. నాయన వచ్చి భుజం మీద చెయ్యివేసి, "దావీదూ, నీకోసం ఆయన వేచి ఉన్నారు" అని తనని తీసుకొని పోతున్నప్పుడు ఇంత వృద్ధుడైన తన తండ్రి మరి యొక జన్మ ఎత్తినట్లు ప్రశాంతంగా కనిపించాడు.

సమూయేలు రెండడుగులు ముందుకు వేసి తన చెయ్యి పట్టుకొనినప్పుడు చల్లని ఆ చేతిలో గుండెకు వేడిగా ఏదో గుచ్చుకొన్నట్లనిపించింది. తలపైకెత్తి ఆయన ముఖం లోకి చూస్తే ఆయన ముఖం సంతోషంతో త్రిప్పినప్పుడు ఏదో కఠినమైన ప్రశ్నకు సమాధానం దొరికినట్లు అనిపించింది. అమ్మ చెప్పినట్లుగా సీనాయి పర్వతము మీద నుండి క్రిందికి దిగివచ్చిన మోషేగారి ముఖచర్మం ప్రకాశించినట్లు ఉన్నది. సమూయేలుగారు తన తండ్రితో కలిసి దగ్గరకు వచ్చినప్పుడు, సమూయేలుగారు తన కళ్ళతో చూచినప్పుడు, తను తనుగా కాక వేరొక వ్యక్తిగా అనిపించింది. తన అన్నలందరూ వెనుక నడుస్తుంటే తన నడుముకు వ్రేలాడుతున్న కొమ్ముతీసి, అందులో తైలము తన తలమీద ఉన్న పాగా ప్రక్కకు తీసి నూనె పోసినప్పుడు మోరీయా కొండల పైభాగంలో అప్పుడప్పుడూ కనిపించే తెల్లని మేఘము తన కళ్ళ ఎదురుగా దిగి వచ్చినట్లనిపించింది. కుడివైపున ద్వారబంధము ప్రక్కనే నిలుచున్న అమ్మ ఔన్నత్యమును దేవునిలో పెంచిన అమ్మ కనిపించింది. ఆమె కళ్ళలో నీటి చుక్కలు. వెనుక వైపు చూస్తే తన అన్నలు అందరూ ఏదో ఒక అద్భుతం చూస్తున్నట్లుగా ఉన్నారు. తన తండ్రి ముఖం చూసినప్పుడు ఆయన దేవుని సన్నిధిలో, దేవునితో ఉన్నవానివలె కనిపించాడు. తర్వాత సమూయేలుగారు తన నుదుటి మీద ముద్దుపెట్టుకొని వెళ్ళిపోయారు.

తన అన్నలు కాని, తన తండ్రి కాని, ఎవరూ ఏమి మాట్లాడలేదు. అసలు తన అన్నలనందరిని వరుసగా పిలిచి చివరలో తనను పిలచి తనకు మాత్రమే తన కొమ్ములోని తైలము పోసింది ఎందుకు? సాయంకాలం అయ్యేటప్పటికి సమూయేలుగారి బేత్లెహేము రాక సంచనలం సద్దుమణిగింది. పరధ్యానంగా పెరటి మలుపులో కూర్చుని ఉన్న తన ప్రక్కన కూర్చుంటున్న అబీషైని చూసి "అప్పుడే వచ్చావా?" అన్నాడు దావీదు. "అప్పుడేనా? ఇప్పుడు సమయం ఎంత?" అని కొంచెం దగ్గరగా జరిగి "సమూయేలుగారు నిన్ను నూనెతో అభిషేకించి వెళ్ళారంట గదా!" అన్నాడు. "సరే ఈ సంగతి నీకెవరు చెప్పారు?" అన్నాడు దావీదు.

"ఇక్కడ అందరూ చెప్పుకొంటున్నారు. ఎందుకు అభిషేకించారు నిన్ను? ప్రభువు ప్రవక్తగానా?" అన్నాడు అబీషై.

"అసలు ఆయన ఏమి మాట్లాడలేదు. కొంచెంసేపు కన్నులెత్తి పైకి చూసి కొమ్మునువంచి తైలము తల మీద పోసి నుదుట ముద్దుపెట్టుకొని వెళ్ళిపోయారు" అన్నాడు. దావీదు సితారా వాయించడంలో కొత్త నైపుణ్యత కనిపించడం అబీషై గమనించాడు. ఇంతకు ముందు ఎన్నడూ వినబడని క్రొత్త స్వరాలు దావీదు సితార మీద పలికించటం సమూయేలు చేతి స్పర్శతో మొదలైంది. దావీదు తల వెంట్రుకలు బంగారు రంగులో మారటం, చూపులోను మాటలోను ఒక గంభీరత, నడకలో కూడా ఠీవి.

ధనవంతుడైన కీషుకు తన కుమారుడు రాజైన తర్వాత, పూర్వం ఉండిన నెమ్మది లేకపోయింది. మనమడు యోనాతాను మనస్తత్వం తన కుమారుని మనస్తత్వానికి భిన్నమైనది. తండ్రి యొక్క దుడుకుతనం కాని, ఈ మధ్య వచ్చిన అహంభావం కాని అతనిలో లేవు. మనుమరాండ్రు మేరబుకాని, మీకాలుకాని దైవభక్తి లేకుండా ఎదుగుచున్నారు. రాజప్రాసాదం లేకపోయినా, గిబియాలో తన గృహము రాజ ప్రసాదమంత గొప్పదే అయినా ఈమధ్య కాలంలో ఫిలిష్తీయులు పెచ్చరిల్లిన వైఖరి ఆయనను కలవర పెడుతున్నది.

ఎంత ధనవంతుడైనా విధేయుడైన తన కుమారుడు గాడిదలను వెదకి రమ్మంటే ఎదురు మాట్లాడకుండా కొద్ది పైకంతోనే పని వానిని తోడుకొని బయలువెళ్ళాడు. కాని ఈ రోజు తన గతాన్ని మర్చిపోయి, ఇశ్రాయేలీయులకు రాజుననే గర్వంతో తనకే కాకుండా తన కుమార్తెలకు కూడా దానిని కట్టబెట్టాడు. ఇంతకు ముందు ఇశ్రాయేలీయులకు రాజు లేడు యెహోవాయే వారి రాజు. అది మరచి మాకు రాజుకావాలని కోరారు. దేవుడు వారికి రాజును ఇచ్చాడు. తన సంతానాన్ని ఈ విధంగా దేవుడు ఆదరించినా గత కొద్ది నెలలుగా సౌలు ప్రవర్తన భరించలేనంతగా బాధకరమైనది. చిన్నప్పుడు కాని యౌవ్వనస్తుడుగా ఉన్నప్పుడు కాని సౌలు తనని ఎన్నడూ బాధించలేదు. ఇప్పుడు కూడా తనను బాధించలేదు. కాని దురాత్మ కలిగిన మనిషిలాగ తనలో తాను మాట్లాడుకోవడం, ఎవరో తన సింహాసనం కొరకు వేచి యున్నట్లుగా భయపడటం, పని వారిని దుర్భాషలాడటం ఇవన్ని ఇంతకు ముందులేని గుణాలు. తన మాట ఇప్పుడు అస్సలు లెక్క చెయ్యడంలేదు.

ఈ సింహాసనం లేకపోయినా, సంతోషకరమైన ఇల్లు వాకిళ్ళు పిల్లలు మనుమలు ఉన్నా సౌలు ఎందుకు ఇలా ఉన్నాడు. రాజు కాకముందు ముద్దొచ్చే ముఖం ఇప్పు డు ఎందుకు ఇలా అయిపోయింది? సంగీతం అంటే చెవి కోసుకునే తనయుడు... ఇంక ఆలోచించలేకపోయాడు. బెసలేలుకు కబురు చేస్తే వచ్చాడు. వస్తునే కీషు ముఖం చూసి ఖిన్నుడైయ్యాడు.

కీషు బెసలేలును చూస్తూనే ప్రక్కన ఉన్న ఆసనం చూపించాడు. బెసలేలు కృతజ్ఞతాపూర్వకంగా వంగి నమస్కరించి కూర్చున్నాడు. కొద్ది క్షణాలు ఇద్దరూ మౌనంగా ఉన్నారు. "ఇలా ఎక్కువ రోజులు కొనసాగటం మంచిదికాదు. సౌలు విషయంలో ఏదో ఒక ఆలోచన చెయ్యాలి" అన్నాడు కీషు. "అయ్యా, తమరితో ఈ విషయం మాట్లాడే ధైర్యం ఎవరికి ఉంది? ఎవరికి వారు అవమానాలు భరిస్తూ కిమ్మనకున్నారు. ఈ విషయం ఆలోచించటానికి తమరే కబురు చేయటం చాలా మేలు" అన్నాడు.

బెసలేలు గడ్డం తెల్లగా నెరసి ఉన్నది. చిన్నతనం నుండి ఈ సంస్థానంలోనే పెరిగి పెద్దవాడయ్యాడు. "సమూయేలుగారు ఇక్కడికి రావడం మానివేసిన తరువాతనే సౌలు ఈ విధంగా మారిపోయాడు. ఏదైనా దురాత్మ అతనిని వెరపిస్తున్నదని నా అనుమానం" అన్నాడు చిన్నగా. "మీ సెలవు కొరకు ఎదురు చూస్తూ ఇంతకాలం వేచియున్నాను. ఈ మధ్యకాలంలో సమూయేలుగారు బేత్లెహేములో యెష్షయి గారి ఇంటివద్ద బలి అర్పించారు. యెష్షయి యొక్క ఎనిమిది మంది కుమారులలో కనిష్టుడు సితారా చమత్కారంగా వాయించగలడు. కనుక ఆ యౌవ్వనస్తుని పిలిపించటానికి రాజుగారి సెలవు అడగవలెనని అనుకుంటున్నాను" అన్నాడు. ఈ మాటలు ఎండజామున చల్లని గాలివలె అనిపిం చింది. కీషుకి బెసలేలు సలహాలో దేవుని నిర్ణయం కనిపించింది.

**(సశేషం)**

# మరియ

క్రైస్తవులకే కాక క్రైస్తవేతరులకు కూడ యేసుక్రీస్తు తల్లియైన మరియ చిరపరిచితమే. లోకరక్షకుడైన యేసు క్రీస్తు ఈ భూమి మీద జన్మించుటలో తన వంతు పాత్రను పోషించి దేవుని చిత్తమును నెరవేర్చిన మరియ స్త్రీలందరికి మార్గదర్శి. స్త్రీలంద రికి ఆదర్శవంతురాలైన మరియ జీవితమును ధ్యానిద్దాం.

మరియ దేవుని చేత ఎన్నుకోబడినది అంటే ఆమె ప్రవర్తన, దేవునిపట్ల భయభక్తులు, ఆమె భక్తి జీవితం కొనియాడదగినవి.

క్రీస్తు భూమి మీద జన్మించుటకు మరియ మార్గముగా దేవునిచే ఎన్నుకోబడినప్పటికి, దేవుని చిత్తమును నెరవేర్చుట అంత సులభతరమేమి కాదు. మరియ దేవుని చిత్తమును నెరవేర్చుటకు తన విశ్వాస జీవితమును పరీక్షించవలసి వచ్చెను. అయితే ఆమె విశ్వాస జీవితము అగ్నిలో పరీక్షింపబడిన సువర్ణమువలె కొనియాడబడదగినది.

గబ్రియేలు దూత ద్వారా దేవుని ప్రణాళిక తెలుపబడి నప్పుడు మరియ కేవలము ప్రధానము చేయబడినది (లూకా 1:27,28) వివాహం కాకుండా గర్భం ధరించుట అసాధర ణమైన విషయం. సమాజంలో ఎంతో అవమానమును, ద్వేషమును ఎదుర్కోవలసి ఉంటుంది. మరియ ఇంచుమించు మూడు నెలలో ఎలీసబెతు వద్ద ఉండి వచ్చిన తరువాత ఆమె గర్భవతి అని అందరికి తెలిసి ఉండవచ్చు. తాను పరిశుద్ధాత్మ ద్వారా గర్భము ధరించాను అంటే ఎవరు నమ్ముతారు? తల్లిదండ్రులు కూడ నమ్మకపోవచ్చు. మరియ ప్రవర్తన బాగుగ తెలిసిన కారణాన ఒకవేళ తల్లిదండ్రులు నమ్మడానికి ప్రయత్నించినను చుట్టు ఉన్నవారు బంధు మిత్రులు నమ్మరు, పైగా సూటిపోటి మాటలతో బాధిస్తారు. అంటే మరియ కూడ తోటివారి అవమానాలు, తిట్లు భరించి ఉండవచ్చు ఎంతో దయనీయమైన స్థితిని అనుభవించి ఉండవచ్చు అది కూడ తను చేయని నేరానికి.

మరియ "**ఇదిగో ప్రభువు దాసురాలను; నీ మాట చొప్పున నాకు జరుగును గాక** " (లూకా 1:38) అని దేవుని చిత్తమును నెరవేర్చుటకు తన సంసిద్ధత తెలియజేసినప్పుడే ఆమె ఈ అవమానాలు, ఛీత్కారాలు ఊహించి ఉండవచ్చు. అయితే వాటన్నిటిని భరించుటకు తాను సిద్ధపడటమే కాక ఆత్మీయంగా బలపడుటకు ఎలీసబెతు సహవాసాన్ని కోరుకుంది. అది మరియ ఆత్మీయ జీవితం బలపడుటకు కొంత ఉపయోగపడి ఉంటుంది.

దేవుని నిమిత్తం చేయని తప్పుకు నిందను ఇష్టపూర్వకంగా అనుభవించిన నిజక్రైస్తవురాలు మరియ. క్రైస్తవ స్త్రీలైన మనం మరియవలె ఓర్పును, సహనాన్ని కలిగి ఉన్నామా? చేయని తప్పుకు నిందను అనుభవించటం కాకపోయిన దేవుని నిమిత్తం కోపాన్ని అణుచుకొని ఓర్పుగా ఉండగలుగు తున్నామా?

దేవుడు నమ్మదగినవాడు. మీరు సహింపగలిగినంత కంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు (1కొరింథీ. 10:13) కాబట్టి దేవుడు మరియకు యోసేపు ద్వారా ఆదరణ కలిగించాడు.

కైసరు చక్రవర్తి ప్రజాసంఖ్య నిమిత్తం యోసేపు బేత్లెహేము వెళ్ళవలసి వచ్చినప్పుడు మరియ నిండు గర్భంతో ప్రయాణించ వలసి వచ్చెను. ఆ కాలంలో ప్రయాణసౌకర్యాలు సరిగా లేకపోవడమే కాక రహదారుల నిర్మాణం అంతగా జరిగి ఉండకపోవచ్చు. పైగా కొండ ప్రాంతం. ఆ ప్రయాణం ఎంత అసౌకర్యంగా ఉంటుందో మనం ఊహించవచ్చు అది కూడా నిండు గర్భవతికి ఎంత ఇబ్బందిగా ఉండి ఉంటుందో కాదా! మరియ వాటన్నింటిని ఎంతో ఓర్పుతో సహించింది. మరియ తన అసౌకర్యాల నిమిత్తం దేవున్ని నిందించినట్టు ఎక్కడ వ్రాయబడలేదు. ఆమె దైవభక్తి గలది కాబట్టి తనకు కలిగిన బాధను దేవుని నిమిత్తం సహించింది.

ఎంతో ప్రయాసతో బేత్లెహేము చేరితే సత్రములో స్థలము దొరకక పశువుల పాకలో ఉండవలసి వచ్చింది. సాధారణం గా పశువుల పాకలకు కట్టుదిట్టమైన గోడలు వంటివి ఉండవు.

ఆ పశువుల పాక ఎలా ఉన్నదో మనకు తెలియదు కాని, నిండు చూలాలు ఉండటానికి కాని, ప్రసవించడానికి ఏ మాత్రము అనుకూలంగా ఉండదని ఖచ్చితంగా చెప్పవచ్చును. పశువులు ఉంటాయి కాబట్టి కొంత చెడు వాసన ఉండవచ్చు, అంతగా శుభ్రంగా లేకపోయి ఉండవచ్చు ఇలా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ఉండవచ్చు. ఇవేకాక ఇంకెన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని ఉండి ఉంటారో మనం ఊహించలేం.

మనం జీవిస్తున్నది 21వ శతాబ్దం అంటే మరియ జీవించిన కాలంతో పోలిస్తే 2000 సంవత్సరాల తర్వాతి కాలం. కాబట్టి నిస్సంకోచంగా అన్ని రకాలుగా ఎంతో సౌకర్యవంతమైన జీవితాన్నే ప్రతి ఒక్కరం అనుభవిస్తున్నాము. అయినప్పటికి ఇంకా ఏదో కావాలని కోరుకుంటున్నాము, ఇంకా ఏదో ఆశిస్తున్నాము. అది కూడ ఒక రోజు కాదు అనునిత్యం. దేవుడు మనకు దయచేసిన దానితో తృప్తి కల్గి ఉన్నామా? దేవుని కొరకు మరియ వలె ఇబ్బంది పడుటకు ఇష్టపడుతున్నామా?

ఇన్ని ఇబ్బందులు కష్టాలు ఎదుర్కొనిన మరియ సహనం, ఓర్పు నిజంగా కొనియాడదగినవి. యేసు ప్రభువు పుట్టిన తరువాత కూడ హేరోదు వలన పొంచి యున్న ముప్పును బట్టి హఠాత్తుగా బహుశా రాత్రికి రాత్రి ఐగుప్తు దేశమునకు పారిపోవలసి వచ్చెను. దేవుని చిత్త ప్రకారం జీవిస్తున్నప్పటికి ఎన్నో ఇబ్బందులు శ్రమలు ఎదుర్కొన్నది. అంతేకాక యేసుక్రీస్తు పునఃరుత్థానము అనంతరం క్రీస్తును అంగీకరించిన మొదటి శతాబ్దపు క్రైస్తవులలో మరియ కూడ ఒకరు.

అంతేకాదు మొదటి శతాబ్దపు సంఘ పెద్దగా చెప్పబడిన యాకోబు, యూదా పత్రిక వ్రాసిన యూదా మరియ కుమారులే. అంటే ఆమె వ్యక్తిగత విశ్వాస జీవితమే కాక కుటుంబమును కూడా దేవునియందు భయభక్తులలో నడిపించింది అనవచ్చు.

దేవుని చిత్తం నెరవేర్చాలని అందరూ కోరుకుంటారు, కాని కొంతమందే దేవుని చిత్తమును తెలుసుకుంటారు. దేవుని చిత్తం తెలిసినప్పటికి దానిని నెరవేర్చుటలో వచ్చే ఇబ్బందులు తెలియక, ఎదుర్కోలేక, విశ్వాసక్రియలు లేనివారై దేవుని చిత్తమును నెరవేర్చలేక దేవునికి దూరమౌతారు. అయితే మరియ దేవుని చిత్తం నెరవేర్చుట కొరకు శ్రమలు సహించుటకు సిద్ధపడింది కాబట్టే దేవుని చిత్తమును నెరవేర్చి సర్వ మానవాళి కొరకు దేవుడు ఏర్పరిచిన రక్షణ భూమ్మీదకు తెచ్చుటలో అత్యంత ప్రధానమైన పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయింది.

స్త్రీలు అనునిత్యం ఇంటి పనులలోను, పిల్లలతోను, అనేక బాధ్యతలు సమయానుకూలంగా నిర్వర్తించవలసి ఉంటుంది కాబట్టి స్త్రీలలో ఓర్పు, సహనం కోరదగిన గుణాలు. అటువంటి సుగుణాలు కలిగి ఉన్నందునే మరియ దేవుని ఇష్టాన్ని నెరవేర్చుటలో సఫలీకృతురాలైంది. బైబిల్లో స్థానం సంపాదించింది. ధన్యురాలైంది. క్రైస్తవ స్త్రీలైన మనం కూడ అటువంటి సుగుణములు కలిగి ఉండుటకు ప్రయాసపడదాం. దేవున్ని బట్టి ఓర్పు కలిగి ఆయనకు ఇష్టులుగా జీవిద్దాం.

"**శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని యెరిగి శ్రమలయందును అతిశయ పడుదుము**" (రోమా 5:3-4)

మొదటి క్రిస్మస్ జరుగుటకు మరియ చూపిన ఓర్పు, సహనమనే అత్యుత్తమ గుణాలను కలిగి క్రిస్మస్‌ను జరుపుకుందాం. క్రీస్తుకు నిజమైన ఆరాధకులుగా జీవిద్దాం.

# Happy Christmas

## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరదమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

# సువర్తమానము

***"ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియ జేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు"*** లూకా *2:10,11*

ఈ వాక్యభాగములో దూత ప్రజలందరూ సంతోషించివలసిన ఒక మంచి వార్త లేదా సువర్తమానము తెచ్చింది. ఆ వర్తమానము ఏమిటంటే మనకొరకు **రక్షకుడు** పుట్టియున్నాడు అనునది. యేసుప్రభువు కేవలం క్రైస్తవులకో, లేదా ఇశ్రాయేలు దేశస్థులకో రక్షకుడు కాదు. యేసుప్రభువు **ప్రజలందరికి రక్షకుడు**. ఎవరు అంగీ కరించినా, అంగీకరించకపోయినప్పటికి **యేసు సర్వ మానవాళికి రక్షకుడు**. చాలామంది యేసుక్రీస్తును దేవునిగా అంగీకరించినా ఆయనను రక్షకుడుగా అంగీకరించరు, ఆయన రక్షణ తమకు అవసరం లేదని అనుకుంటారు. కానీ సర్వ మానవాళికి యేసుప్రభువు ఇచ్చే రక్షణ అత్యవసరం. రక్షకుడు అని ఎవరిని అంటారు? ఆ రక్షకుని అవసరం ఎవరికి ఉందో చూద్దాం. యేసు అంటే రక్షకుడు అని అర్థం. దేని నుండి ఆయన మనల్ని రక్షిస్తాడు?

***''తన ప్రజలను వారి పాపాల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అని పేరు పెట్టుదువనెను"***

ప్రజలను వారి పాపాల నుండి రక్షిస్తాడు కాబట్టి ఆయనను రక్షకుడు అన్నారు. పాపాల నుండి ఎందుకు రక్షించాలి అంటే పాపము మనుష్యులను పరిశుద్ధుడైన దేవుని నుండి దూరం చేస్తుంది. కాబట్టి పాపముల నుండి రక్షించబడి దేవుని చేరాలి లేదా పాపం చేయకుండా ఉండాలి. కానీ ఆదాము హవ్వలు దేవుని ఆజ్ఞను మీరి ఈ లోకంలోకి పాపాన్ని ప్రవేశపెట్టారు. వారి అవిధేయత ప్రతి మానవునిలో ప్రవేశించబడింది. జాగ్రత్తగా ఆలోచిస్తే ఎవరికి వారు తాము పాపులము అని గ్రహించగలుగుతారు. ఉదా॥ మనలో ప్రతి ఒక్కరు 'నా ఇష్టం' అని ఏదో ఒక సందర్భం లో వాడుతుంటాం. ఆ వాక్యం ఎప్పుడు వాడతారో ఒక నిమిషం ఆలోచించండి ఎవరైనా మంచి చెప్తే అది మనకు రుచించనప్పుడు చాలా సింపుల్‌గా నా ఇష్టం నీకెందుకు అంటాం కదా! అదే అవిధేయత. మంచిని తిరస్కరించడమే అవిధేయత. కాబట్టి నీవు ఏ కులానికి చెందిన ఏ మతానికి చెందిన వ్యక్తివైనా సరే పాపానికి అతీతుడవు కాదు. ప్రతి ఒక్కరిలో పాపస్వభావం పుట్టుకతోనే ఉంటుంది. చిన్న పిల్లలు సైతం కోపం, అసూయ, కుళ్ళు వంటి లక్షణాలను కనపరుస్తారు. వారికేమి తెలియనప్పటికి సహజంగానే వారికి ఆ స్వభావం వస్తుంది. ఈ లోకంలో ప్రతి ఒక్కరు పాపం చేసినవారే. కాబట్టి అందరూ పాపులే. పాపులమైన మనం దేవుని చేరడం అసాధ్యం. మన పాపాలు దేవునికి మనకి అడ్డుగా ఉన్నాయని బైబిల్ చెప్తుంది. **"మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను"** *యెషయా 59:2.* కాబట్టి పాపియైన మనిషి దేవునిని చేరలేడు. పాపంలో కొట్టు మిట్టాడుతున్న మనిషి తన పరిస్థితిని తనకు తానుగా బాగుచేసుకోలేడు. ఆ పాప బంధకాలు తెంచుకొని రావడం ఎలాగో మనిషికి తెలియదు తెలిస్తే పాపమే చేయకుండా ఉండేవాడు కదా! కాబట్టి మానవుని తన పాప స్థితిలో నుండి రక్షించడానికి ఒక రక్షకుడు కావాలి. ఆ రక్షకుడే యేసు.

ఈత రాని వ్యక్తి నీటిలో కొట్టుకొని పోతూ, రక్షించండి రక్షించండి అని అరుస్తున్నాడు. అటుగా వెళ్తున్న ఒక వ్యక్తి చూసి జాలిపడి రక్షించాలి అనుకున్నాడు కానీ అతనికి ఈత రాదు కాబట్టి నీళ్ళలో కొట్టుకొనిపోతూ ఉన్న వ్యక్తికి ఏ విధమైన సహాయం చేయలేకపోయాడు. ఇప్పుడు వీళ్ళిదరూ ఇంకెవరైనా వస్తారేమో, మునిగిపోతున్న వ్యక్తిని రక్షిస్తారేమో అని చూస్తున్నారు. ఇంతలో ఈత తెలిసిన వ్యక్తి ఆ దారిన వెళ్తున్నాడు, పరిస్థితి చూసి జాలిపడి తన ప్రాణాలకు తెగించి మునిగిపోతున్న వ్యక్తిని కాపాడాడు.

ఈ సందర్భాన్ని జాగ్రత్తగా గమనించండి. ఇక్కడ నీళ్ళలో మునిగిపోతున్న వ్యక్తి  తనంతట తానుగా ఆ పరిస్థితిని అధిగమించలేడు. తను ఎటువంటి ప్రమాదకరమైన పరిస్థితి లో ఉన్నాడో తెలుసు కానీ తనకు తాను సహాయపడలేడు. తన పరిస్థితిని తాను బాగుచేసుకోలేడు. అందుకే అతను ఎవరైనా తనను రక్షిస్తారేమో అని తనను కాపాడే రక్షకుని కొరకు ఎదురుచూస్తూ, తనను కాపాడమని రక్షించమని అరుస్తున్నాడు. అతనిని పరిస్థితి చూసి జాలిపడే వారు చాలా మంది ఉంటారు కానీ ఆ పరిస్థితిని అధిగమించగలిగే వ్యక్తికి కొన్ని లక్షణాలు ఉండాలి. ఆ వ్యక్తికి ఈత వచ్చి ఉండాలి, కొట్టుకొని పోతున్న వ్యక్తిని చూసి జాలిపడాలి. ప్రమాదంలో ఉన్న వ్యక్తి కొరకు రిస్క్ చేయాలి. నీటిలో మునుగుతున్న వ్యక్తిని చేరడానికి ఈత వస్తే చాలు కాని ఆ వ్యక్తిని ప్రమాదం నుండి బయట పడేయడానికి సరిపోయే బలము, ధైర్యము కలిగి ఉండాలి కదా.

యేసుప్రభువు పాపరహితుడుగా ఈ లోకంలో జన్మించాడు. ఆయన శరీరేచ్ఛవలన గాక పరిశుద్ధాత్మ వలన జన్మించాడు, పరిశుద్ధమైన జీవితాన్ని (నాజీరు/ ప్రత్యేకమైన) జీవించాడు. ఆయన సమకాలీనులు ఎవ్వరూ ఆయనలో పాపమున్నదని అనలేనంత పరిశుద్ధంగా జీవించాడు ***"నాలో పాపమున్నదని ఎవడు స్థాపించగలడు?"*** యోహాను 8:46. కాబట్టి మరణంపై విజయాన్ని సాధించాడు. పాపానికి ప్రతిఫలంగా ఈ లోకంలోకి వచ్చింది మరణం. అటువంటి మరణానికి పరిశుద్ధుడైన యేసుపై ఎటువంటి అధికారము లేదు. కాబట్టి యేసుప్రభువు ఒక్కరే పాపపంకిలమైన మనిషి జీవితాన్ని మార్చగలిగే సమర్థుడు. ఆయన మాత్రమే రక్షించ డానికి యోగ్యమైనవాడు. ఆయన దేవుడైయుండియు మానవుల స్థితిని చూసి జాలిపడి దానినుండి బయటపడే మార్గాన్ని చూపించ డానికి, చూపించడమే కాక ఆ మార్గము తానై జనులందరిని పాపము నుండి రక్షించి, మానవునికి దేవునికి మధ్యవర్తిగా ఈ భూమిపైన పుట్టాడు. స్వయంగా దేవుడే మానవుని రక్షించడానికి పూనుకున్నాడు. అందులో మొట్టమొదటి భాగము భూమిపై దేవుని పుట్టుక. మరి దేవుడు మనపై ఇంత శ్రద్ధ చూపి మన కొరకు మనిషిలా పుట్టడం నిజంగానే మనకు సువర్తమానమే కదా! సంతోషమే కదా!

మరి ఇంత సంతోషాన్ని మనం అనుభవించాలి అంటే ఎవరికి వారుగా యేసుప్రభువును తమ స్వంత రక్షకునిగా అంగీకరించాలి. యేసుప్రభువు మాత్రమే ఈ లోక పాప భారము నుండి నిన్ను రక్షించి, పరమందున్న దేవుని యొద్దకు నిన్ను చేర్చే ఏకైక మార్గమని విశ్వసించాలి. అప్పుడు మాత్రమే దేవుడు రక్షకునిగా ఈ లోకంలో నీ కొరకు, నా కొరకు పుట్టాడని నీవు గ్రహిస్తావు. ఆ ఆనందాన్ని నీవు అనుభవిస్తావు. అంతే కాదు ఈ క్రిస్మస్ సమయంలో నీ ఆనందాన్ని ఆ ఆనందానికి కారణమైన సువర్తమానాన్ని అన్యుజనులకు తెలియపరచాలి. ఉచితంగా నీవు పొందిన రక్షణను, సంతోషాన్ని ఇతరులతో పంచుకోవాలి.




**పాఠకులకు, చందాదారులకు,**

**ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు**

**క్రిస్మస్ మరియు**

**నూతన సంవత్సర శుభాకాంక్షలు!!**

**- ఎడిటర్ మరియు సిబ్బంది**

# గెరూతు కింహాము

ఆ రోజు బేత్లెహేమంతా సంబరాలతో పరవశించి పోతుంది. ప్రజలందరూ ఆనందసాగరంలో మునిగి ఉన్నారు. ప్రతీ గృహము ముందు ఖర్జూరపు మట్టల పందిర్లు వేసి ఉన్నాయి. ప్రతీ ద్వారం రంగులు పులుముకున్నాయి. ప్రతీ గోడ ఇశ్రాయేలీయుల విముక్తి సందేశాలతో నిండి ఉంది. ఒలీవ చెట్లకు రంగురంగుల దారాలు వ్రేలాడదీసి ఉన్నాయి. అంజూరపు కొమ్మలకు మట్టి దీపాలు వ్రేలాడదీసి ఉన్నాయి. రూతు పరిగె ఏరిన బోయజు పొలములో గొఱ్ఱెల మందలు ప్రశాంతంగా నెమరు వేస్తూ ఉన్నాయి. తరతరాలుగా ఇశ్రాయేలీయులు పాటిస్తున్న యెహోవా ఆజ్ఞ ఆనాటితో రద్దు చేయబడింది. వెలి వేయబడిన మోయాబీయులు, యూదుల సమాజంతో సంగమమైన సంతస సంఘటనకు నాందీ ప్రస్థావనమారోజు! ఆ రాత్రి యూదుల ధర్మపరిపాలకుడును ప్రేమామయుడైన 'బోయజు' వివాహం. ఇశ్రాయేలీయుల వనితలు మోయాబీయురాలైన 'రూతు'ను పెళ్ళి కూతురుగా అలంకరిస్తున్నారు. బోయజు నిర్మించిన వినూత్న మైన ఒక రాతి సదనములో ఆ వివాహం జరగనుంది. ఆ సదనం పేరు 'రియోథ్ (రూతు) బేత్'. అది బోయజు రూతు కిచ్చిన ప్రేమ కానుక!

'రూతు బేత్' బేత్లెహేము ఈశాన్య పొలిమేరకు ఆనుకొని ఉన్న బల్లపరుపు కొండలో తొలిచిన ఒక సుందర మందిరం. దానిలో గాలి వెలుతురు ధారళంగా ప్రసరించుటకై పైన కిటికీలు అమర్చి ఉన్నాయి. లోపల చమురు దీపగుళ్ళను, శిలా ఆసనాలను, పడక గదులను, రాతి పాన్పులను, స్నానపు తొట్లను, సన్నని నార యవనికలు ఏర్పరచిన 'రాజ సౌధము' అది.

ఆ రాజసౌధంలో జరిగే వివాహమునకు చుట్టు ప్రక్కల గ్రామాలన్నీ తరలి వస్తున్నాయి. నఃభూతో నఃభవిష్యత్‌గా జరగబోయే ఆ వివాహస్థలం 'లోకరక్షకుడైన యేసుక్రీస్తు' ఆగమనానికి వేదికని ఆనాటి ప్రజలకు తెలియదు! ఈనాటి ప్రజలకు కూడా తెలియదు! రాజ సదనమైన ఆ రాతి గృహము నాలుగు తరాల యూదా వంశస్థులకు నివాస స్థలము. రూతు–బోయజు, (భార్యపేరు అన్వేషణలో ఉంది) ఓబేదు, నిత్జాబెత్–యెష్షయి, మీకాలు–దావీదు తరముల వారికి అదే నివాస స్థలము.

ఇశ్రాయేలీయుల రాజుగా అభిషేకింపబడిన దావీదు, తన స్వగృహమైన 'రూతు బేత్'ను వదిలి యెరూషలేమును కేంద్రంగా చేసికొని అక్కడ నుండే పరిపాలన సాగించాడు. దావీదు తండ్రియైన యెష్షయి బ్రతికినంత కాలము 'రూతు బేత్' వైభవాన్ని కాపాడుకుంటూ వచ్చాడు.

రాజ్యాధికారం కోసం దావీదు కుమారుడైన అబ్షాలోము తండ్రిపై తిరుగుబాటు చేశాడు. అబ్షాలోములో పరివర్తనను కాంక్షించిన దావీదు, యుద్ధం చేయక తన సైన్యంతో సహా మహనయీము అరణ్యంలో తలదాచుకున్నాడు. ఈ విషయం విన్న రోగెలీము నివాసి, గిలాదీయుడైన బర్జిల్లయి అనే స్నేహశీలి, ధర్మధాత, అధిక ధనవంతుడు దావీదుకు సకల సౌకర్యాలు, భోజన సదుపాయాలు సమకూర్చి ఆదుకున్నాడు. అబ్షాలోము మరణానంతరం దావీదు యెరూషలేముకు తిరిగి వెళ్తూ, తనను ఆదుకొనిన బర్జిల్లయిను తనతో కూడా యెరూషలేము రావలసిందిగా ఆహ్వానిస్తాడు. వృద్ధుడైన బర్జిల్లయి తనకు బదులుగా తన ఏకైక కుమారుడైన 'కింహాము'ను దావీదుతో పంపిస్తాడు (2సమూ. 17:27-29, 19:31-40, 1రాజులు 2:7)

యెరూషలేము వచ్చిన దావీదు మహారాజు 'కింహాము'ను తీసుకొని బేత్లెహేములో ఉన్న తన స్వగృహము 'రూతు బేత్'ను దర్శించేందుకు వస్తాడు. దొంగల స్థావరంగా మారి, పాడుపడి పోయిన ఆ ఇంటిని చూచి ఎంతో దుఃఖిస్తాడు. జీర్ణావస్థలో ఉన్న రూతుబేత్‌ను చూచి ఎలుగెత్తి ఏడుస్తాడు. రూతు బేత్‌లో నివాసముంటున్న దొంగలను వెళ్ళగొట్టి ఆ గృహ నిర్వాహకాన్ని కింహాముకు అప్పగిస్తాడు. తన స్వ గ్రామమైన బేత్లెహేమును నవీకరించి సుందరీకరణ చేయమని అతనితో చెప్పి దావీదు యెరూషలేమునకు వెళ్ళిపోతాడు.

కింహాము కృషితో రూతుబేత్ పూర్వపు వైభవాన్ని సంతరించుకుంటుంది. ఆ గృహాన్ని బాటసారులు బసచేసే విడిది గృహంగా మారుస్తాడు. ఆ రాతి కొండ చుట్టూ వారి ఒంటెలు, కంచర గాడిదలు సేదతీర్చుకొనేందుకు నీటి తొట్లు, మేత తొట్లు ఏర్పాటు చేశాడు. కాలం గడిచే కొలది రూతు బేత్ కాస్తా 'గెరూతు కింహాము' (కింహాం సత్రం)గా పిలవబడింది.

(యిర్మీయా41:18) బేత్లెహేమును పునఃరుద్ధరించి దానికి దావీదు పురముగా నామకరణం చేసి తన తండ్రి బర్జిల్లయి మరణానంతరం రోగెలీము వెళ్ళిపోతాడు కింహాము.

**ఆ దావీదు పట్టణమునందు నేడు మీ కొరకు రక్షకుడు పుట్టియున్నాడు. ఈయనే ప్రభువైన యేసు** (లూకా 2:8).

తండ్రియైన దేవుని చిత్తము నెరవేర్చుటకు, ఆనాటి రోమా ప్రభుత్వపు ఉత్తర్వులను గౌరవిస్తూ ప్రజాసంఖ్యలో తన పేరుతో పాటు తనకు పుట్టబోయే బిడ్డపేరును కూడా నమోదు చేయాలనే దృఢసంకల్పముతో నిండు గర్భవతియైన 'కన్య మరియ' ప్రసవ దినమునకు సమీపస్తురాలైయుండీ, తనకు ప్రధానము చేయబడిన యోసేపుతో గలిలయలోని నజరేతు నుండి యూదయలోని బేత్లెహేమనబడిన దావీదు పురమునకు పయనమయ్యింది (లూకా 2:5).

ఆ ప్రయాణం ఎత్తైన కొండలను ఎక్కుతూ, లోతైన ప్రవాహములను దాటుతూ, గాఢాంధకార లోయలలో దిగుతూ. ఇసుక తుఫానులు చెలరేగే ఎడారులలో కూరుకు పోతు అపాయకరమైన మెలికలు తిరిగిన దారులలో సాగింది. ఎంతో కష్టతరమైన ఆ దారిలో పగలంతా పయనిస్తూ, రాత్రులందు రాళ్ళగుట్టలలో విశ్రమిస్తూ మూడు రోజులు కంచర గాడిద మీద పయనిస్తే గాని నజరేతుకు డెబ్బై మైళ్ళ దూరంలో దక్షిణాన ఉన్న బేత్లెహేముకు చేరుకోలేరు. వాస్తవానికి ఆ పరిస్థితుల్లో క్లిష్టమైన ఆ ప్రయాణం మరియకు అంత క్షేమకరం కాదు. కానీ లోక పాపములను మోసుకొని పోవు లోకరక్షకుణ్ణి తన గర్భములో మోస్తూ, తన యెడల దేవునికున్న సంకల్పమును, ప్రవక్తయైన మీకా ప్రవచనమును నెరవేర్చాలనే కృతనిశ్చయంతో ఎంత దూరమైనా, ఎంత భారమైన బేత్లెహేములోనే ప్రసవించాలని బయలుదేరింది మరియ (మీకా 5:2). మానవాళికి రక్షణ కలుగజేయు వాక్యమునకు శరీర రూపమిచ్చి లోక రక్షకునికి తల్లినౌతున్నాననే మధుర భావన, వేదనాభరితమైన పురిటి భారాన్ని మరిపించి గత స్మృతులతో మురిపించింది! తన గత జీవితం ఒక దృశ్య కావ్యమై మనో ఫలకంపై జారిపోతూ, ఆ సుదూర ప్రయాణాన్ని సునాయాసం చేసింది.

తనకు సమీప బంధువైన ఎలీసబెతు భర్త, అబీయ తరగతి యాజకుడైన జెకర్యా నడుపుతున్న వేదపఠనశాలలో పాలస్తీనా బాలికలతో పాటు మరియ కూడా విద్యాభ్యాసం చేస్తూ ఉండేది. పాలస్తీనా ఆడపిల్లలు దైవభీతి కలవారు, సూక్ష్మగ్రాహులు. విశ్రాంతి దినమును అతినియమనిష్ఠలతో పాటించేవారు. ప్రవక్తల ప్రవచనాలలోని నిగూఢ మర్మాన్ని ఇట్టే గ్రహించేవాళ్ళు. యవ్వనస్తురాలైన ఆ బాలికలందరూ ఒకరోజు త్రికాల జ్ఞానియైన యెషయా మూల పాఠములను చదువుతూ...

"ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని, అతనికి 'ఇమ్మానియేలు' అను పేరు పెట్టును" అనే ప్రవచనముపై వారి మనస్సులు లగ్నమైపోయాయి. ఆ ప్రవచనములోని అర్థము గ్రహించినా అదెలా సాధ్యమనే మీమాంస వారందరినీ ఆలోచింపజేసింది.

కానీ దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదనే సృష్టి సత్యాన్ని మరియ ప్రగాఢంగా విశ్వసించింది. ఆ ప్రవచనము ద్వారా దేవుని సంకల్పములోని లోక కళ్యాణమును అర్థం చేసుకుంది. ఆ సూచక క్రియలో నిబిడీకృతమైయున్న దేవుని రక్షణ సూత్రమును పరిపూర్ణమైన ఆత్మతో ఔపోసన చేసింది. ఆ విషయ సారాంశం తనతోటి యవ్వనస్తురాండ్రతో పంచుకుంది. అర్థం చేసుకున్న మరియ స్నేహితురాండ్రు అందరూ 'మసీహా'ను తమ పవిత్రమైన గర్భములో మోయాలనే ఆశతో వివాహమునకు విముఖులైపోయారు. మరియ మాత్రం ఆ ధన్యతకు తాను యోగ్యురాలినా? అనే సందేహంతో ఆ విషయాన్నే మర్చిపోయింది. మరియ తల్లి 'ఆనీ'కి మరియను యాజక కుటుంబములోని వరునికి ఇవ్వాలని యాజకుడైన జెకర్యాను సంప్రదిస్తూ ఉండేది.

ఒకనాడు జెకర్యా దైవాదేశమునొందిన వాడై "ఎవరి చేతి కర్రయితే చిగురిస్తుందో అతడే మరియను భార్యగా పొందగల అర్హుడు" అని ప్రవచించాడు. ఆ సమయంలో ఆరాధనా పీఠమును బాగుచేయుటకు యూదయలోని దావీదు పురము నుండి వచ్చిన నజరేతు పరవాసి, దావీదు వంశస్థుడును వడ్రంగియైన యోసేపు దర్శన దండం చిగురించింది. (పెద్దలను దర్శించే వారు గౌరవ సూచకంగా చేతికర్రతో వెళ్ళడం యూదుల ఆచారం) అదే దైవ నిర్ణయంగా శిరసావహించిన ఆనీ, కన్యయైన మరియను యోసేపుకు ఇచ్చి ప్రధానము చేసింది. ఆనాటి యూదుల ఆచార ప్రకారం ప్రధానానంతరం ఒక సంవత్సరం తర్వాత వివాహం జరిగేది. ఆ కాలం కన్యక పవిత్రతకు పరీక్షా కాలం.

ఒకరాత్రి మరియ ధాన్యపు బానలున్న గది తలుపులు మూస్తుండగా ఆకాశం నుండి ధవళ కాంతిధార నేరుగా మరియపై ప్రసరించి ఆమెను దిగ్భ్రాంతికి గురిచేసి మోకరిల్ల జేసింది. ఆ కాంతి '**మరియా! భయపడకుము. నీవు పరిశుద్ధాత్మ ద్వారా గర్భము ధరించి కుమారుని కని, ఆయనకు 'యషువ' (యేసు) అను పేరు పెట్టుదువు**' అనే దైవ ఆదేశాన్ని సందేశంగా వినిపించింది (లూకా 1:26-35). యెషయా ప్రవక్త పలికిన ప్రవచనం తన యెడల నెరవేరబోతున్నందుకు ఆత్మనందు ఆనందించింది మరియ. ఆ పవిత్ర కార్యానికి తనను ఎన్నిక చేసికొన్న దేవాది దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించింది.

మోషే ధర్మశాస్త్రాన్ని తలపోయక, యూదా సంప్రదాయాలకు బెదరక, లోకాపవాదులకు ఎంత మాత్రము వెరవక, ప్రధానము చేసికొన్న యోసేపు పరిత్యజిస్తాడనే దిగులును దరి చేరనీయక దైవాజ్ఞను శిరసావహించి కన్యక గానే గర్భము ధరించే సాహసం చేసింది మరియ. ఇప్పుడు నిండు గర్భవతిగా ప్రధానము చేసికొన్న యోసేపుతో తన మెట్టినింటికి ప్రయాణమైంది. తన గతాన్ని తలపోస్తూ సమరయ ఈశాన్య పొలిమేరను చేరుకొంది. యూదయ దేశం చేరాలంటే, పాలస్తీనా యూదులు సమరయ దేశం ద్వారా పయనించేందుకు ఇష్టపడరు. దాయాదులైన సమర యులను యూదులు అన్యులుగానే భావిస్తారు. మరియ మాత్రం సమరయలో సేద తీర్చుకోవాలని తమ పితరులు త్రవ్వించిన 'యాకోబు బావి' వద్ద బస చేసింది. యాకోబు బావి నానుకొని ప్రతిమారాధనకు ప్రతిష్ఠింపబడి ఎదురుగా ఉన్న గెరిజీము పర్వతమును చూచి కలత చెందింది. భారమైన తన గర్భస్థలి దైవతనయుడు సమరయ దీనస్థితికి బాధగా నిట్టూర్పుగా కదిలాడు!

మరునాడు వారి ప్రయాణం బేత్లెహేము పొలిమేరలో ఆగింది. దూరాన ఉన్న 'రాహేలు స్మారక స్థంభం' వారికి స్వాగతం పలుకుతూ ప్రత్యక్షమైంది. దావీదుపురంలో జనాభా లెక్కల్లో చేరేందుకు వచ్చిన జనం బస చేసేందుకు స్థలం దొరకక గుంపులు గుంపులుగా అటూ ఇటూ తిరుగుతున్నారు. చెలరేగిన ఒంటెల ధూళి ఆకాశాన్ని అంటింది. ఆ మసక సంధ్యవేళ మరియ గార్ధభ వాహనంపై కూర్చోలేక యోసేపు భుజములపై సోలిపోయింది. బాధను భరించలేక ఆ ధూళిలో పడి పొర్లాడింది మరియ. జగన్నాధుని మోస్తున్న ఆమె గర్భాన్ని అనేక బాటసారుల పాదాలు తాకుతూ, దాటుతూ వెళ్ళిపోతున్నాయి. చూసే వారేగాని సహాయం చేసే వారెవ్వరూ లేరు.

మెల్లగా 'దావీదు పురం పొలిమేర'లో ఉన్న 'కింహాము సత్రము'లోకి మరియ చేర్చబడింది. ప్రసవ సమయం సమీపించిన వేళ పరలోక ప్రకాశం మరియను చుట్టివేసింది. ఆ పరిధి చుట్టూ చీకటి కమ్మివేసింది. ఆ బహిరంగ వెలుగు వేదికపై లోకపాపములను మోయు రక్షకుడైన యేసుకు జన్మనిచ్చి కన్య మరియ మాతృమూర్తిగా మారిపోయింది. పరలోకం పరవశించింది. సురగణం ఆ శుభ సందేశాన్ని సంకీర్తనలతో వినువీధుల నుండి భూలోకానికి వినిపించింది. ఆ సత్రంలో పురిటి బిడ్డకు పడకలేక ఒక 'పశువుల తొట్టిలో' పొత్తిగుడ్డలతో పరుండ బెట్టారు. పరలోక దూత ద్వారా 'లోకరక్షకుడు' పుట్టాడనే శుభ వార్తను, రూతు పరిగె ఏరిన బోయజు పొలంలో తమ మందను కాస్తున్న యాదవులు తెలుసు కొని 'కింహాము సత్రము' వెళ్ళి ఆయనను దర్శించి ధన్యులయ్యారు. యేసుక్రీస్తు పుట్టింది వారసత్వపు రాజగృహంలో. ఈ సువార్తను మొట్టమొదట ప్రజలకు తెలిపిన వారు యాదవులే (లూకా 2:1-14).

యేసుక్రీస్తు పుట్టిన తర్వాత 'కింహాము సత్రము' వారసుడైన యోసేపునకు సంక్రమించింది. దానిని అనుకూలమైన గృహంగా మార్చి యేసుక్రీస్తుతో అందులో నివసించసాగారు. యేసుక్రీస్తు ఆ ఇంటిలో బాలుడుగా పెరుగుతున్న సమయంలో, రాజవంశీకులు రాజప్రసాదంలోనే జన్మిస్తారనే ఉద్దేశంతో తూర్పు దేశపు జ్ఞానులు రాజప్రసాదమున్న యెరూషలేమును చేరుకొంటారు. కానీ యూదయ దేశపు బేత్లెహేములో బోయజుచే నిర్మింపబడిన 'రాజసదనం' ఒకటి ఉందనే ప్రవక్తల ప్రవచనమును విస్మరించారు. యూదుల రాజుగా పుట్టిన యేసును వెదుకుతూ, బేత్లెహేములోని రూతు బేత్‌ను సందర్శించి బాల యేసుకు కానుకలు సమర్పించారు తూర్పు దేశపు జ్ఞానులు (మత్తయి 2:9-11). అప్పటి బాలయేసుని వయసు సుమారు రెండు సంవత్సరములు.

'యేసుక్రీస్తు దీనుడుగా సత్రములో, పశువులపాకలో జన్మించాడు' అనే వార్త సువార్తకు సత్యదూరం. 'యేసుక్రీస్తు బోయజు నిర్మించిన 'రూతు రాజమందిరం'లో జన్మించాడు'. ఇదే సువార్త సారాంశం.

క్రీస్తు జయంతి శుభములతో **రెవ.డా.ఏ.యన్.ఆర్. జక్కం**

# నడచి వచ్చింది క్రిస్మసమ్మ

ఎందుకమ్మ పండుగమ్మా
మళ్ళీ ఎందుకొచ్చావమ్మా
ఎవర్ని ఉద్ధరిద్దామని
రెండు వేల సంవత్సరాలుగా
నడిచి నడిచి నీనడ్డి విరిగి ఉండాలి
ముక్కుతూ మూల్గుతూ
ముని ముని ముని ముని
మనుమడి పెళ్ళికొచ్చినట్లు
అంతదూరం నుండి ఇంతదూరం వరకు
ఎందుకాశ్రమ నీకు
ఏమి ఆశించి వస్తున్నావో తెలియదు
నువ్వొచ్చావని, నడిచొచ్చావని
ఎవరైనా, ఒకరైనా పులకిస్తారా! పలకరిస్తారా!
ఎవరి కొత్తబట్టల్లో వారు
ఎవరి వరి పొలాలులో వారు
ఎవరి ఫలసాయంలో వారు
ఎవరి పలావులో వారు
నిన్నెవరు పట్టించుకుంటారమ్మ
మీ కోసం దేవుణ్ణి తెచ్చానంటావు
మృత్యుంజయుడిగా ఆయన్ని చేశానంటావు
ఎవరూ పట్టించుకోరు నిన్ను
సువార్తమ్మా నీకు
సుస్తీ చేసిందని విన్నాం
కర్ర పట్టుకొని ముక్కుతూ మూల్గుతూ
ప్రతి యేటా పండగ సందడికి
కుంటుకుంటూ వచ్చిపోతుంటావు
మా మనుష్యులు మారరు
చేరరు నీ దరికి
బాలయేసుడు మరల
టేడై వచ్చువరకు

సహజకవి
డా.ఎన్. జయకుమార్‌రావు, విశాఖపట్నం

## సండేస్కూల్ మెటీరియల్

| | |
|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-2 | రూ. 35/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-3 | రూ. 45/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్ | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-1 | రూ. 35/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-2 | రూ. 45/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-3 | రూ. 50/- |
| మార్గము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. 20/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. 20/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. 40/- |
| సండేస్కూల్ డైరి | రూ. 60/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-1 | రూ. 25/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-2 | రూ. 40/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. 40/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. 40/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. 10/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. 160/- |

### సండేస్కూల్ గేమ్స్

| | |
|---|---|
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. 300/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. 250/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. 120/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. 300/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. 300/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. 350/- |
| ఫ్రూట్స్ ఆఫ్ స్పిరిట్ బోర్డ్ గేమ్ | రూ. 350/- |
| ట్యాబర్‌నికల్ బోర్డ్ గేమ్ | రూ. 350/- |
| ఈజిప్ట్ టు కానాన్ జర్నీ బోర్డ్ గేమ్ | రూ. 350/- |

**బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**
కృపాదానంగారివీధి, క్లోపేట, 6వ లైను,
ఒంగోలు-523001, ప్రకాశం జిల్లా,
ఫోన్ : 9440217726

చిన్నపిల్లల పేజి

# క్రిస్మస్ బహుమానము

డల్‌గా ఒక మూలను మౌనంగా కూర్చున్న బ్లెస్సీని చూసి, ఏమైంది తల్లి, ఎందుకు డల్‌గా ఉన్నావు అడిగింది తల్లి ప్రేమగా. కానీ బ్లెస్సీ ఎటువంటి సమాధానమివ్వలేదు. ఇది పండుగ సమయం కదా అందరూ సంతోషంగా ఉంటే నువ్వెందుకు డల్‌గా ఉన్నావు? అన్నది తల్లి

పండుగ సమయం కాబట్టే చిన్నగా గొణిగింది బ్లెస్సి. తల్లికి విషయమై అర్థమైంది. బ్లెస్సిని ప్రేమగా దగ్గరకు తీసుకొని నీ రూమ్‌ను మిని, మైఖెల్‌తో షేర్ చేసుకోవడం నీకు ఇష్టం లేదా? వాళ్ళు నీతో పాటు వారే కదా, చక్కగా వారితో కొత్త కొత్త ఆటలు ఆడుకోవచ్చు, సరదగా సమయం గడపవచ్చు కదా అన్నది.

మిని మైఖెల్ నన్ను వారి ఆటవస్తువులు తాకనివ్వరు మమ్మీ. వాళ్ళు ధనవంతులని, మనం పేదవారమని చులకన. అయిన అంత ధనవంతులై ఉండి ప్రతి క్రిస్మస్‌కి మన ఇంటికి వస్తారెందుకు? నువ్వేమో వారితో నా రూమ్‌ను షేర్ చేయమంటావ్ అన్నది కాస్త కోపంగా.

డానీ అంకుల్, కేరీ ఆంటీ వాళ్ళు వ్యాపారం నిమిత్తం ఇంటికి దూరంగా ఉంటూ పిల్లలను హాస్టల్‌లో చదివిస్తున్నారని నీకు తెలుసు కదా. ఎప్పుడో ఏడాదికి ఒక్కసారి ఇంటికి వస్తారు. ఈ కొన్ని రోజులు కొంచెం సర్దుకోలేవా? అన్నది తల్లి.

వాళ్ళు మనలన చులకన చేసి ఏదో ఒకటి అంటారు. నేను తిరిగి అంటే గొడవ అవుతుంది. నువ్వేమో వాళ్ళనే సమర్థించి మాట్లాడతావు. అందుకే వాళ్ళు రావడం నాకు నచ్చదు. నాకు పింక్ కలర్ బార్బీ డ్రస్ కొనివ్వమంటే డబ్బులు లేవు అంటావు వాళ్ళు రాగానే వాళ్ళు అడిగినవన్నీ కొనిస్తావు నిజం చెప్పాలంటే నీకు వాళ్ళంటేనే ఇష్టమని నాకు తెలుసు అన్నది బ్లెస్సి బుంగమూతి పెట్టుకుని.

తల్లి మనస్సులో నొచ్చుకొని, కాస్త సమయం తీసుకొని బ్లెస్సి నీకు క్రిస్మస్ కథ చెప్పనా? అన్నది టాపిక్ మారుస్తూ. బ్లెస్సి చాలా నిరాశగా నాకు క్రిస్మస్ కథ తెలుసు మమ్మీ. నువ్వేమి చెప్పదలచావో నాకు అర్థమైంది మిని మైఖెల్ వాళ్ళు వస్తున్నారు వాళ్ళు నా రూమ్‌లో ఉంటారు అంతేగా అన్నది.

కాదు అన్నది తల్లి.

మరి..? అంటే ఈ క్రిస్మస్‌కి వాళ్ళు రావడం లేదా? హిప్ హిప్ హుర్రే అంది బ్లెస్సి సంతోషంగా.

ఈ సారి మిని మైఖెల్ మాత్రమే కాక, వాళ్ళ స్నేహితులు బంధువులు, రోజిఆంటీ, వారి పిల్లలు, నాగాలాండ్ తాతయ్య ఇంకా అందరూ మన ఇంటికే వస్తున్నారు అన్నది తల్లి.

బ్లెస్సి సంతోషం అంతా ఒక్క సెకనులో ఆవిరైపోయి ఇద్దరు సరిపోరని ఇంతమంది వస్తున్నారా ఇక ఈ క్రిస్మస్ జీవితాంతం గుర్తుంటుంది అని చిన్నగా గొణిగి ప్రక్కకు వెళ్ళి దిగాలుగా కూర్చుంది.

తల్లి బ్లెస్సి దగ్గరకు వెళ్ళి – బ్లెస్సి నీకొక విషయం చెప్పనా, ప్రతి ఒక్కరి జీవితలలో అన్నిటికంటే సంతోషకరమైన రోజు క్రిస్మస్ ఎందుకంటే ఆ రోజు యేసయ్య మన.....

యేసయ్య మన కొరకు పశువులపాకలో పుట్టాడు. కాబట్టి మనం సంతోషించవలసిన సుదినం అంతేగా. ఇది నాకు తెలుసు మమ్మీ, సండేస్కూల్‌లో చెప్పారు అంది బ్లెస్సి తల్లి మాటలకు అడ్డుతగులుతూ.

కేవలం అంతేకాదు... యేసయ్య దేవుడై ఉండి నీ కొరకు, దేవునిలా కాక పేదవానిలా పశువుల పాకలో పుట్టాడు. పరలోకంలో యేసయ్యకు మంచి ఇల్లు, సింహాసనం, అన్ని రకాల సౌకర్యాలు, ఇంకా ఎంతో మంది పరిచారం చేసే దేవదూతలు ఉన్నారు. యేసయ్య అవన్ని వదులుకొని మన కొరకు మనలా, మామూలు మనిషిలా పుట్టాడు కదా? ఎందుకంటావ్? అడిగింది తల్లి చిరునవ్వుతో.

తల వంచుకొని మౌనంగా ఉన్న బ్లెస్సి గడ్డం పట్టుకొని పైకెత్తుతూ, నీవే ఒక ధనవంతురాలై నీ కారు బంగ్లా అన్ని

వదిలేసి పూరిపాకలో ఉండమంటే ఉంటావా? అడిగింది తల్లి.

ఊ...హు... తల అడ్డంగా ఊపింది బ్లెస్సి.

మరి యేసయ్య ఎంతో సంతోషంగా అవన్నీ వదులుకొని భూమ్మీదకు వచ్చి కష్టపడి జీవించింది నీకు పరలోకం ఇవ్వడం కోసం. "పుచ్చుకొనుట కంటే ఇచ్చుట ధన్యము అని యేసయ్య చెప్పాడు (అపొ.కా.20:35). మరి నీవు మినికి మైఖెల్‌కు నీ రూమ్ షేర్ చేయడానికి, నీ ఆట వస్తువులు ఇవ్వడానికి ఎందుకు ఇష్టపడడం లేదు చెప్పు? అన్నది తల్లి.

మిని మైఖెల్ ప్రవర్తన నాకు నచ్చదు. వారికి ఏదైనా ఇవ్వాలి అంటే నాకు కోపం బాధ కలుగుతున్నాయి మరి నేనేం చేయాలి? అన్నది బ్లెస్సి కాస్త చిరాకుగా.

యేసయ్య నీకు పరలోకం ఇవ్వడం కోసం అన్నీ వదులుకున్నాడు కదా మరి నీవు యేసయ్య చెప్పినట్లు చేయడం కొరకు నీకు కలిగే బాధను చిరాకును కోపాన్ని సహించుకొని వారికి సంతోషాన్ని ఇవ్వు. అప్పుడు నువ్వు కూడా యేసయ్య వలె దేవునికి ఇష్టమైన బిడ్డవు అవుతావు అన్నది తల్లి.

తలవంచుకొని మౌనంగా ఉంది బ్లెస్సి.

చూడు బ్లెస్సి ఇచ్చుట శ్రేష్టమని యేసయ్య చేసి చూపించాడు. అలా చేసేటప్పుడు మనకు కొంత బాధ కలిగిన మనం సంతోషంగా ఇవ్వడం నేర్చుకోవాలి. కాస్త ఇబ్బంది అనిపించినా కోపం వచ్చినా యేసయ్యతో నీ బాధనంతా చెప్పేసెయ్. ఇక యేసయ్య చూసుకుంటాడు. కాబట్టి నీవు గొడవలు పెట్టుకోక సంతోషంగా ఉండాలి. నేను చెప్పినట్లు చేసి చూడు బ్లెస్సి ఇది నీ జీవితంలో బెస్ట్ క్రిస్మస్ అవుతుంది అని చెప్పి తల్లి వెళ్ళిపోయింది.

బ్లెస్సి రెండు నిమిషాలు ఆలోచించి మోకరించి ప్రభువా నేను ఈ క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోవాలను కుంటు న్నాను. నాకు సహాయం చేయి అని ప్రార్థన చేసుకుంది.

బంధువులతో ఇళ్ళంతా సందడి సందడిగా ఉంది. బ్లెస్సి సంతోషంగా తన రూమ్‌ను ఇతరులతో పంచుకుంది. ముందు కాస్త ఇబ్బందిగా అనిపించినా గొడవలు పెట్టుకోక మౌనంగా ఉండటం నేర్చుకుంది. బ్లెస్సిలోని ఈ మార్పును గమనించిన తల్లి ఎంతో సంతోషించింది.

చివరికి క్రిస్మస్ గిఫ్ట్స్ తీసుకునే సమయం వచ్చింది. పిల్లలందరూ పరుగెత్తి క్రిస్మస్ ట్రీ వద్ద పెట్టి ఉన్న బహుమతులను తీసుకుంటున్నారు. బ్లెస్సి అందరూ తీసుకున్న తరువాత చివరిగా ఉన్న గిఫ్ట్‌బాక్సును తీసుకోబోయింది ఇంతలో మిని వచ్చి ఆ గిఫ్ట్ బాక్సు తనది అని లాక్కుంది. బ్లెస్సికి ముందు కోపం వచ్చినా పోనిలే అని మినికి గిఫ్ట్ బాక్సు ఇచ్చి వెను తిరిగి చూస్తే ఇక అక్కడ గిఫ్ట్స్ లేవు. అందరి దగ్గర గిఫ్ట్స్ ఉన్నాయి తనకు మాత్రమే బహుమానం లేకపోవడంతో ఏడుస్తూ తన రూమ్‌కి వెళ్ళిపోయింది బ్లెస్సి.

కొంత సమయం తరువాత హాల్‌లోకి సంతోషంగా వచ్చిన బ్లెస్సిని చూసి ఆమె తల్లితో సహా అందరూ ఆశ్చర్యపోయారు. తాతయ్య బ్లెస్సిని దగ్గరకు తీసుకొని అందరి దగ్గర క్రిస్మస్ బహుమానాలున్నాయి, నీకు తప్ప. మరి నీకు బాధగా లేదా? అని అడిగాడు.

బాధగా ఉంది అంది చిరునవ్వుతూ.

బ్లెస్సి ముఖం చూసిన ప్రతి ఒక్కరి నయనాలు కన్నీటితో నిండాయి. అప్పుడు తాత మినిని పిలిచి మందలించి మిని రెండవసారి తీసుకున్న గిఫ్ట్ బాక్సును బ్లెస్సికి ఇప్పించాడు. అయితే బ్లెస్సి ఆ గిఫ్ట్ బాక్సును తీసుకోక నేను మినికి నా గిఫ్ట్‌ను సంతోషంగా ఇచ్చివేస్తున్నాను. యేసయ్య నానుండి కోరేది ఇదే అన్నది మెరిసే కళ్ళతో.

అందరూ చప్పట్లు కొట్టి బ్లెస్సిని మెచ్చుకున్నారు. తాతయ్య తన బ్యాగ్‌లో నుండి ఒక బాక్సు తీసి బ్లెస్సికి ఇచ్చాడు. బ్లెస్సి కళ్ళు ఆనందంతో మెరిశాయి. సంతోషంతో బాక్సు తీసి చూసింది. బ్లెస్సి ఆనందానికి హద్దులు లేవు. అది తను ఎప్పటి నుండో కావాలనుకుంటున్న పింక్ బార్బి డ్రస్.

బ్లెస్సి తాతయ్యను చుట్టుకొని ఇది నా బెస్ట్‌క్రిస్మస్ గిఫ్ట్ తాతయ్య అంది. నిజానికి నీవే యేసయ్యకు ఒక మంచి బహుమానము అన్నాడు తాతయ్య నవ్వుతూ.

# కృపాదానం

వెంటనే పోస్టు ఆఫీసుకు వెళ్ళి "గాడ్‌హర్డ్ ప్రేయర్స్" అని భార్యకు టెలిగ్రాం ఇచ్చాక, తర్వాత రైల్లో జరిగిన సంగతంతా విపులంగా భార్యకు ఉత్తరం వ్రాశాడు కృపాదానం. హైదరాబాద్ చేరిన వారం తర్వాత న్యూ ఇండియా అష్యూరెన్సులో ఏజెంటుగా ఉద్యోగం ఇచ్చారు. అయితే రెండు నెలలు హైదరాబాద్ మెయిన్ ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తూ పని నేర్చుకోవాలి అన్నారు.

తన దగ్గర ఉన్న కొద్ది డబ్బులు మధ్యాహ్నం భోజనానికి పదిరోజులకు సరిపోయాయి. తర్వాత కంపెనీవారు అడ్వాన్సు ఇచ్చారు. ఉదయం రాత్రి ఆ వృద్ధ దంపతులు భోజనం పెట్టారు. ఇంటి వెనుకభాగంలో సామాను ఉన్న చిన్నగదిని ఖాళీచేసి కృపాదానంకి ఇచ్చారు. ఒకవేళ తనకు హైదరాబాద్‌లో చుట్టాలు ఉన్నా తనను ఇంత ప్రేమగా చూసి ఉండేవారు కాదు. హైదరాబాద్‌లో తను నివశింపవలసిన స్థలాన్ని ప్రభువు ముందుగానే సిద్ధపరచి, రైలులోనే కృపాదానంను వారితో కలిపాడు. తన కొరకు తన తల్లి నిత్యము ప్రార్థిస్తుంది అని ఇంతకాలం ధైర్యంగా జీవించాడు. కాని ఇప్పుడు హైదరాబాద్ ప్రయాణంలో తన తల్లి ప్రార్థన కాదు కాని యేసయ్య శాశ్వత ప్రేమ, ఇంట్లో తన భార్య ప్రార్థన తనను కాపాడుతున్నాయని గ్రహించాడు. సామర్ల కోటలో వచ్చిన శోధన తనను హైదరాబాద్ నడిపించటానికి దేవుని ప్రణాళిక అని గ్రహించాడు.

ప్రార్థన వలననే తను కృంగి పోకుండా జీవితం అంటే భయపడకుండా ఉండగలిగాడు. భయము వలన వచ్చే, అంటే భవిష్యత్ భయము వలన వచ్చే షుగర్, బి.పి.వంటి రుగ్మతల నుండి కాపాడబడ్డాడని గ్రహించాడు. అప్పుడు కృపాదానం వయస్సు 37 సంవత్సరాలు, ఏదైన కష్టం వచ్చినప్పుడు దాని ద్వారా కలిగే భవిష్యత్ భయాన్ని గురించి ప్రభువుకు ప్రార్థన చేసిన తర్వాత, యేసయ్యాకు చెప్పుకున్నాము అనే ఆదరణ మనలను మానసిక శరీర రుగ్మతల నుండి కాపాడుతుందని మర్సపూడిలో ఆయన చేసిన ప్రసంగంలో చెప్పారు.

తూర్పు గోదావరి జిల్లాలో తుని పట్టణానికి 11 మైళ్ళ దూరంలో ఉన్న కోటనందూరు గ్రామం చేరాలి అంటే తారురోడ్డు మీద ఉన్న వృక్షాలు మధ్యలో నడుస్తూ వెళ్ళి అప్పుడప్పుడు ఆకస్మికంగా వరద వలే పొంగి వచ్చే నదిని దాటాలి. నీళ్ళుంటే నది దాటాలి లేకుంటే, ఇసుకలో నడిచి పోవాలి. ఆ నదిని దాటగానే వచ్చేదే కోటనందూరు గ్రామం. ఆ గ్రామం చేరితే కాపురం ఉండబోయే కుగ్రామం భీమవరపు కోట. ఒక కొండ ఉన్నది ఆ కొండపేరు తెలియదు కాని ఆ కొండ దక్షిణం వాలు మీద అర కిలో మీటరు పొడవులో తూర్పువైపున మాలలు పడమర వైపున మాదిగలు ఉంటారు. మధ్యలో ఉన్న కొండ మీదుగా కొండ అవతల ఉన్న గ్రామానికి దారి. ఆ దారి ప్రక్కగా అప్పల స్వామి నాయుడు గారి ఇల్లు. అక్కడ అటు ఇటు ఉన్న గుడిశెల వారందరిలో కొంత మెరుగైన జీవితం గల కుటుంబం. కొంచెం చదువు కున్న పెద్దమనిషి ఆయన ఇంటి ప్రక్కనే పూర్వం ఆయనకి పశువులు ఉన్నప్పుడు కట్టబడిన పాక. పశువులపాకకు మూడు ప్రక్కల గోడ ఉత్తరం తట్టు సగం గోడ మాత్రమే కట్టబడినందున అదే వాకిలి.

అద్దెకు అక్కడ ఇండ్లు దొరకవు కనుక ఆ పశువుల పాకనే కృపాదానం కుటుంబమునకు నివాసమైనది. ఆ ఇళ్ళకి ఎదురుగా ఒక చిన్నసైజు కోటవంటి గోడలున్న పెద్ద పెంకుటిల్లు. ఆ ఇంట్లో ఎంతమంది ఆడవారు ఉన్నారో? ఎందరు మగవారు ఉన్నారో? పిల్లలెందరో ఎవరికీ తెలియదు. ఆ కోటకు బయట పెద్ద మర్రిచెట్టు. ఆ చెట్టు క్రింద ఒలంపిక్ గేమ్స్ వంటి సంక్రాంతి కోడిపందాలకు రెఫరీగా కోటలో నుండి ఓ పెద్దాయన బయటకు వచ్చి, ఆయన కొరకు వేయబడిన మంచమంత కుర్చీలో కూర్చుంటాడు. అప్పుడు మాత్రమే ఆయనను ఎవరైన చూడ గలరు. ఆ ఊరు పేరు భీమవరపుకోట.

పశువుల పాకలో కాపురం పెట్టిన కృపాదానంకు

మొదటి రోజున వాకిట్లో రెండు మామూలు పాములు స్వాగతం పలికాయి. ఆ దెబ్బకు కృపాదానం యొక్క ఏడుగురు సంతానం రాత్రంతా ఏ వైపు నుండి అయినా పాములు వస్తాయేమోనని కిరోసిన్ దీపం (గుడ్డి దీపం) వెలుతురులో కూర్చున్నారు.

ఆ ఇల్లు తప్పితే వేరొక ఇల్లు దొరకదని ఖాయంగా తెలుసు. ఒకవేళ దొరికినా అది కూడా కొండమీదనే. అక్కడకి పాములు, కప్పలు రావని గ్యారెంటీ ఏమిటి? తెల్లవారే వరకు కుటుంబమంతా అలానే కూర్చున్నారు. ఈ ఉదయమే ప్రయాణమై మరలా సామర్లకోట వెళ్ళిపోదాం అని కృపాదానం అంటారని అందరు ఆశించారు. కాని కృపాదానం "మనం ప్రార్థన చేసుకునే వారం. అంటే మనం యేసు ప్రభువుతో మాట్లాడేవారము. ఆయన మన కొరకు అప్పల స్వామినాయుడుగారికి పశువులు లేకుండా చేసినందున మనం ఇక్కడ యేసుప్రభువుతో కలిసి ఉంటున్నాము. మీరు అందరు ప్రతిరోజు రాత్రి పడుకొనే ముందు ఉదయం నిద్రలేచిన తర్వాత ప్రార్థన చేసుకోవాలి. నేను మీ అందరి కోసం ప్రార్థన చేస్తుంటాను" అని అందరి కొరకు ప్రార్థన చేశాడు.

హన్నమ్మ పెద్దవాళ్ళను ముగ్గురిని తీసుకొని స్కూలుకు వెళ్ళేది. రెండవకూతురైన మార్తను ఆఖరి కూతురు అరుణను చూడటానికి ఇంట్లో పెట్టి వెళ్ళేది.

కృపాదానం గారికి ఉన్న ప్రార్థన, దాని ద్వారా కలిగిన విశ్వాసం ఎన్నోసార్లు పరీక్షకు గురికాబడినది. అంతా నేలమీదనే. ఆఖరి ముగ్గురు చిన్నపిల్లలకు మాత్రం మంచం. పెద్ద వాకిట్లో క్రింద పండుకొనిన కృపాదానం కుడి చిటికెన వ్రేలును పెద్ద గండు చీమ కుట్టింది. కళ్ళు తెరచి చూచిన కృపాదానంకు ఒక గజం దూరంలో చుట్టచుట్టుకొని సుఖంగా నిద్రిస్తున్న పెద్దపాము కనబడింది. దానిని కర్రతో గట్టిగా కొట్టిన దెబ్బలకు కృపాదానం కుటుంబమే కాకుండా కొంచెం దూరంలో ఉన్న అప్పలస్వామినాయుడుగారి కుటుంబ సభ్యులు కూడా నిద్రమేలుకొని వచ్చి, విషయం తెలుసుకొని అంత పెద్ద పాము కాటు నుండి కాపాడటానికి ప్రభువు చిన్న చీమని వాడుకొనిన తీరుకు ఆశ్చర్యపోయాడు కృపాదానం. ఒకరోజు మధ్యహ్నం 3 గంటలకు పెద్దకుమారునికి చదువు చెబుతున్న కృపాదానం గబుక్కున లేచి గోడమూలలో పై భాగాన వెళ్తున్న పాము తోకపట్టుకొని బయటకు గబుక్కున లాగి పడేసి కర్రతో కొట్టి చంపాడు.

1948 ప్రారంభంలో భారత ప్రభుత్వం కమ్యూనిస్టుల మీద నిషేధం విధించి తూర్పు కనుమలలో ఉన్న పట్టణాల లోను, నూజివీడు ప్రాంతము లోను కమ్యూనిస్టు నాయకుల ను నిర్భంధించారు. వారి ఆచూకి కొరకు గ్రామాలలో ఉన్న మగవారినందరిని, రెండు వరుసలుగా నిలబడిన రిజర్వు పోలీసుల మధ్య నడిపిస్తూ కమ్యూనిస్టు నాయకుల ఆచూకి తెలుపమని లాఠీలతో కొట్టేవారు. అప్పుడు కూడా ప్రార్థనతోనే ధైర్యం తెచ్చుకొని గ్రామం విడిచిపోలేదు కృపాదానం. రిజర్వు ఇన్స్పెక్టర్ కృపాదానంను పిలిపించి వివరాలు అడిగి వదిలిపెట్టారు. 1949లో సంవత్సరం చివరి వరకు తుని పరిసర ప్రాంతాలలో ఇన్సూరెన్స్ ఇన్స్పెక్టర్గా పనిచేసి నవంబర్లో సామర్లకోటకు బదిలీ అయ్యారు.

**చందాదారుల వివరములు**

1. ప్రసాద్‌రావు గారు ( హైదరాబాద్) మొదటి నుండి కిరణ్ అనే పేరున పత్రికను పోషిస్తున్నారు.
2. డా॥ వినయ్‌కుమార్ (ఇ.యన్.టి అపోలో) – 5000 (ప్రతి సం॥ము)
3. డా॥. బి. ఉషా సతీష్ గారు (నెల్లూరు) – 2000 (ప్రతి సం॥ము)
4. దానం. మెర్సీ ఇశ్రాయేల్ గారు (నెల్లూరు) – 1000 (ప్రతి సం॥ము)
5. అపో. ఎబినేజర్ గారు (హైదరాబాద్) – 1500 (ప్రతి నెల)
6. దాసరి పాల్ – 3000 (ప్రతి నెల)
7. గంధం. డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (ప్రతి నెల)
8. ముద్ద. సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
9. జి. స్టాలిన్ (కావలి)
10. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
11. సుమతి చక్రవర్తి
12. దాసరి. మాధవరావు

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**

**A/c No. 10957294340**

# దేవుని మీద ఆధారపడు

చాలా సందర్భాల్లో మన పనుల కోసం ఇతరులపై ఆధారపడతాము. కొన్ని పనులు చేసుకోడానికి మనకు శక్తి సరిపోదు, లేదంటే మన పనులు చేసుకోడానికి బద్దకించి ఇతరులపై ఆధారపడతాము. మనం సాధించుకోలేని పనుల కోసం కూడా ఇతరుల సహాయం తీసుకోక తప్పని సరి అవుతుంది. అయితే మన పనుల కోసం మనుష్యులపై ఆధార పడినప్పుడు కూడా ఆ పనులు మనం సాధించుకోలేక చాలా ఇబ్బందులకు గురవుతుంటాము.

ఈ లోకంలో చాలా మంది తమ పనులు సాధించు కోడానికి చాలా పలుకుబడి ఉన్న డబ్బున్న వ్యక్తులతో లేదా రాజకీయ నాయకులతో స్నేహం చేస్తారు. వాళ్ళని సంతోష పెట్టడానికి ఎన్నో చేస్తారు. అయితే అదంతా కేవలం స్వార్థంతో చేసేదే తప్ప వాళ్ళంటే ఏ మాత్రం ప్రేమ ఉండి కాదు. దేవుడిని ప్రేమించే వారు దేవునిపై ఆధారపడి జీవించుట వలన వారి ప్రతి పనిని సాధించుకోగలుగుతారు. మన ప్రతి పని కొరకు దేవుని మీద ఆధారపడినప్పుడు దేవుడు మన పనులు నెరవేర్చుకొనుటకు మనల్ని సుళువైన మార్గములో నడిపిస్తాడు. చాలామంది అంటారు, దేవుడు మనకి తెలివితేటలు ఇచ్చింది మన పనులు మనమే చేసుకోవాలని కదా అని. నిజమే, మనమే చేసుకోవాలి. అయితే మనం చేసుకోనే పనులు కేవలం మన తెలివితేటలతోనే కాకుండా, దేవుని యొక్క పర్యవేక్షణలో జరగటం వలన మన పనులను తేలికగా సాధించుకోవచ్చు. 'మనుష్యులను నమ్ముకొనుట కంటె యెహోవాను ఆశ్ర యించుట మేలు' (కీర్తనలు 118:8).

మనుష్యులను నమ్మి వారి మీద ఆధారపడితే మోసం చేస్తారు. అయితే దేవున్ని నమ్ముకొని ఆయన మీద ఆధార పడిన వాళ్ళని దేవుడు ఆదుకుంటాడు. ఆయన మనల్ని కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. అయితే మనమే దేవుని మీద విశ్వాసం లేక ఆయన మీద ఆధాపడేందుకు ధైర్యం చెయ్యలేము. దేవున్ని నమ్మేవాళ్ళు, విశ్వాసులమని చెప్పుకొనే వాళ్ళు సైతం కొన్ని క్లిష్టమైన పరిస్థితుల్లో దేవుని మీద ఆధారపడకుండా మనుష్యులను ఆశ్రయిస్తుంటారు. అప్పుడు దేవుడు బాధపడతాడు. దేవుడు తగిన సమయమందు తప్పక సహాయం చేస్తాడు. అప్పటి దాకా ఆగలేక తమ విశ్వాసాన్ని కోల్పోతుంటారు. మన పనుల భారము దేవుని మీద మోపినప్పుడు దేవుడు మన ఉద్దేశాలన్నీ సఫలం చేస్తాడు. మన పనులలో అపజయం రాకుండా దేవుడు మనకు సహాయం చేస్తాడు. 'నీ భారము యెహోవా మీద మోపుము ఆయనే నిన్ను ఆదుకొనును' (కీర్తనలు 55:22).


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, తెలుగు క్రైస్తవ సినిమాలు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు, క్రైస్తవ వివాహ వేదిక, మీ ప్రార్థన అవసరతల కొరకు ప్రార్థనా గది... ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి... www.onlinetelugubible.net**

**www.onlinetelugubible.net**

# దేవుడు - సిరి

సృష్టికర్తయైన దేవునికి ఏమి లోటు? ఆయన నోటి మాటతో సర్వసృష్టిని కలుగజేసినవాడు. నేలమంటితో మనిషినిచేసినవాడు. ఆయన వ్రేళ్ళు మానవుని ప్రతి భాగమును సృజించాయి. ఒక మనిషికి ఎన్ని వెంట్రుకలు ఉండాలో కూడా నిశ్చయించినది ఆయనే. మనం ఊహించలేని సంఖ్య కలిగిన నక్షత్రములను నిర్మించినవాడు వాటికన్నిటికి పేరులు పెట్టినవాడు. యోబు 28వ అధ్యాయము ప్రకారం మానవుడు నిలుచుండిన భూమి అడుగుభాగములో ఆయన ఉంచిన సర్వసంపదలు, మన ఊహకందనివి. ఇశ్రాయేలీయులు మాంసము కావాలని ఏడిస్తే కొన్ని గంటలలోనే దాదాపు ఇరవై లక్షలమంది తినగలిగిన దానికంటే ఎక్కువ మాంసము, త్రాగగలిగినంత నీరును ఓ రాతిలో నుండి మహానదిని ప్రవహింపజేసిన దేవుడు, మానవుని ఎందుకు ఇవ్వమని అడుగుతున్నాడు?

యేసుక్రీస్తు నిన్న నేడు ఏకరీతిగా ఉన్నాడు. ఆనాడు ఐదు రొట్టెలతో రెండు చిన్న చేపలతో వేలమందికి ఆహారం పెడితే వాళ్ళు తిని మిగిల్చినవి పన్నెండు గంపలు. ఆయన శక్తి ఇప్పుడు లోపించిందా? మరి మనుష్యులను ఇవ్వండి అని ఎందుకు అడుగుతున్నాడు. మనిషిని భూమిమీద సిద్ధపరచకముందే అతను ఈ లోకంలో జీవించడానికి అవసరమైనవన్ని అతని కొరకు సిద్ధము చేసి అడగండి మీకు ఇవ్వబడుతుంది అని చెప్పిన తండ్రి, తన బిడ్డలను దశమభాగము, కృతజ్ఞతార్పణలు ఇంకా అలాంటివి ఎన్నో వారి వారి సంపాదనలలోనుండి ఇవ్వమని అడుగుతున్నాడు.

తన దాసులైన యాజకులను పోషించుకొని తన మందిరములో ఆహారముండేటట్లుగా అర్పణలు తెమ్మంటున్నది – ఈ చట్టాలన్ని మానవులకు దీవెనలు కలుగజేయటానికే కదా! ఈ సృష్టి అంతా చట్టప్రకారంగాను సైంటిఫిక్‌గాను నడుపబడేటట్లుగా నిర్మించాడు. ఎన్ని వేల సంవత్సరాలు గడచినప్పటికి మానవుని మేధస్సుకు మించిన సృష్టిలో మార్పు రాలేదు. కాబట్టి సూర్యోదయము అస్తమయము ఋతువులు అన్ని నడిపింపబడుతున్నవి. ఆ చక్రములోనే మనిషి సమృద్ధిలో ఆరోగ్యముతో జీవించాలని దేవుని చట్టము.

పౌలు ఎఫెసు సంఘస్తులతో, తన ప్రసంగములో ముగింపు మాటగా – పుచ్చుకొనుటకంటె ఇచ్చుట ధన్యము అని ప్రభువైన యేసు చెప్పిన మాటలు జ్ఞాపకము చేసుకొనవలయుననియు అన్ని విషయములలో మీకు మాదిరి చూపితినని చెప్పెను.

మనకు ఏదైనా ఎక్కడ నుండి సమకూడినప్పుడు అది మనకు ధన్యత అని మనం నమ్ముతాము. బైబిల్ గ్రంథములో అయితే అలా కాదు. నీ దగ్గర ఉన్న నీ ఆహారమును – నీ ఆహారమును నీళ్ళమీద వేయుము. చాలా దినములైన తరువాత అది నీకు కనబడును. నీ ఆహారము – గింజలను పొలములో దున్న బడిన తర్వాత పొలంలో నీరు పెట్టిన తర్వాత గింజలు చల్లితే చాలాకాలం తర్వాత సమృద్ధిగా పంటను కోస్తావు. అదే విధముగా బీదలకు ఇచ్చినది, దేవాలయములోకి తీసుకొని వచ్చినది కూడా చాలాకాలం తర్వాత నూరంతలు గా పంటను కోస్తాము.

మనం ఎంత సమృద్ధిలోకి నివశించాలని కోరుకుంటామో అంత పెట్టుబడి పెట్టాలి. ఇతరులకు ఇచ్చుట మనకు ధన్యత అవుతుంది. ఈ విధముగా ఇవ్వటం కూడా బహు దాతృత్వముతో కూడినదైయున్నది. సామెతలు 11:24 వెదజల్లి అభివృద్ధి చెందినవాడు కలరు. ఔదార్యము గలవారు పుష్టినొందుదురు.

దేవుని వాగ్దానాలు మనతో నెరవేరాలంటే ఆ నెరవేర్పు కొరకైన చట్టాలను తప్పక పాటించాలి. చట్టాలు అంటే భక్తి విశ్వాసము ప్రార్ధన బైబిలు చదవటం మొదలగునవి మాత్రము కాదు కాని ఒక మనిషి మరొక మనిషి ఎడల దాతృత్వము, ప్రేమ కలిగివుండుట.

# లోకంతీరు

(పుట్టుక చావు మధ్య సంబరం)

**"నీ చేతిపనియైన నీ ఆకాశములను నీవు కలుగజేసిన చంద్రనక్షత్రములను నేను చూడగా నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు? దేవునికంటె వానిని కొంచెము తక్కువ వానిగా చేసియున్నావు. మహిమ ప్రభావములతో వానికి కిరీటము ధరింపజేసియున్నావు. నీ చేతి పనుల మీద వానికి అధికారమిచ్చి యున్నావు " కీర్తనలు 8:3-6.**

డబ్బు ఎంత సంపాదిస్తే తనకు సరిపోతుంది అన్నదానికి మితం లేదు. డబ్బు సంపాదించడానికి రకరకాల మార్గాలు అన్వేషిస్తుంటాడు. ఉద్యోగం ద్వారానో, వ్యాపారం ద్వారానో వచ్చే డబ్బు తన విలాసాలకి సరిపోకపోతే ఇంకా ఇతర మార్గాల ద్వారా సంపాదించాలని కోరుకుంటాడు. ఒక మనిషి తన కొరకు రోజుకి వెయ్యి రూపాయలు ఖర్చు చేస్తే 70 సంవత్సరాలకు 2 కోట్ల 52 లక్షలు ఖర్చు చేస్తాడు. ఒకవేళ ఆ మనిషి 10 కోట్లు సంపాదించినా ఇంకా సంపాదించాలి అనుకుంటాడు. చనిపోయే వరకు కూడా సంపాదిస్తూనే ఉంటాడు. ఈ లోకములోని భోగాలను అను భవించడానికే మనిషి సంపాదిస్తుంటాడు. ఇదంతా తన 'ఘనత' కోసమే. మనిషి తన ప్రతి అంశములోను ఘనత చూపించుకోవాలని ఆరాటపడుతుంటాడు. ఈ లోకంలో జీవించే మనుష్యుల ముందు తన గొప్పతనాన్ని ప్రదర్శించు కొని 'ఘనత' పొందాలని కోరుకుంటాడు. అయితే మనిషి దేనినైతే తనకు ఘనముగా ఎంచుకుంటాడో దానిని దేవుడు అసహ్యించుకుంటాడు. **"మనుష్యులు ఘనముగా ఎంచబడినది దేవుని దృష్టికి అసహ్యము"** లూకా 16:15. అంటే మనుష్యులు తమ ఘనతకోసం ప్రాకులాడే ప్రతిదాన్ని దేవుడు పెంటలాగా అసహ్యించుకుంటాడు. ఒక మనిషి **'నేను'** అనుకోవడం ప్రారంభించిన తర్వాత తన **'స్థాయి'**ని పెంచుకోవడానికి దేవుడు తనకిచ్చిన తెలివితేటలను ఉపయోగించి మనుష్యుల ముందు **'ఘనత'** కోరుకుంటాడు. తనను సృజించిన దేవుని తెలుసుకోవడానికి దేవుడు మనిషికిచ్చిన తెలివితేటలను మనిషి దుర్వినియోగం చేస్తూ, తను ఈ లోకంలో జీవించే పరిమితకాల జీవితం మొత్తాన్ని ఈ లోకానుసారంగా మలచుకోవడమనేది సాతాను మనిషి మీద విసరే వలలో చిక్కుకోవడమే. సాతాను సృష్టిం చిన ఈ లోకభోగాలు కోరుకోవడమే మనిషి దేవునికి దూరమవడానికి ముఖ్యకారణం. యేసు క్రీస్తు ప్రస్తావించిన లాజరు-ధనవంతుడు ఉపమానములో (లూకా సువార్త 16:19-31), ధనవంతుడు చేసిన పాపము ఏమి లేదు, అతను నరహత్య చేయలేదు, అబద్ధముగాని, దొంగతనముగాని, వ్యభిచారముగాని చేసినట్లు ప్రస్థావించబడలేదు. అయినా సరే అతను పరలోకరాజ్యమునకు వెళ్ళలేదు. ఆ ధనవంతుడైన వ్యక్తి చేసిన తప్పు ఒక్కటే తన ధనము ద్వారా ప్రతిరోజు సుఖముగా ఉండాలనుకోవడం, తన పొరుగువాడైన లాజరును ప్రేమించక పోవడమే తనను నరకమునకు పాత్రునిగా చేసినది. తను ప్రేమించిన తన ధనమే అతన్ని నరకములోనికి నెట్టి వేసింది. దేవుడు తనకిచ్చిన ఆరోగ్యము, తెలివితేటల ద్వారా సంపాదించిన ధనమును వెచ్చించి, తనను శోధించడానికి దేవుడు తన వాకిటనే వుంచిన లాజరు యొక్క స్థితిని మెరుగుపరచాలన్న ఆలోచన కూడా ఆ ధనవంతుని రాకపోడవమే, తోటి మనిషిని ప్రేమించలేని స్వభావమే అతన్ని నరకాగ్ని జ్వాలలలో చిక్కుకొనేలా చేసింది.

> **పుట్టుక**
>
> **దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

**(ఇంకా వుంది)**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | | 3 | ■ | 4 | 5 |
| ■ | 6 | | | 7 | | | |
| 8 | | ■ | 9 | | | ■ | |
| 10 | | 11 | | 12 | | 13 | |
| | 14 | | | | ■ | 15 | |
| | 16 | | | 17 | | | ■ |
| | ■ | 18 | | | | | 19 |
| 20 | | ■ | 21 | | | ■ | |

# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 5

10. తలక్రిందులైన క్రీస్తు (అను మాటకు అర్థం)(5)
13. యూదా రాజు (3)
15. యేసు పుట్టిన కాలంలోని ప్రభుత్వం (2)
19. యోసేపుకు దూత బోధన మార్గం (2)

**అడ్డం:**

1. క్రిస్మస్ పండుగకు కారణం ఎవరి పుట్టుక (4)
6. యోసేపు వృత్తి (3)
7. లూకా 3వ అధ్యా. ప్రకారం తిరగబడ్డ యోసేపు తండ్రి (2)
8. యోసేపు మరియకు కాబోయే... (2)
9. ప్రజాసంఖ్య వీరి ఆజ్ఞ (3)
11. సమాచారం అందజేసే వ్యక్తి / గబ్రియేలు (2)
12. పొల్లు తెగిన దావీదు పట్టణం (4)
14.  మరియ సొంత ఊరు (4)
16. తిరగబడిన సుగంధద్రవ్యము/జ్ఞానుల కానుక (3)
17. యోసేపు వంశం (3)
18. క్రీస్తు జన్మస్థానం (6)
20. యెరూషలేము దేవాలయములోని ప్రవక్తి (2)
21. యేసు తల్లి (3)

**నిలువు:**

2. గబ్రియేలు మరియ యొద్దకు ఇది తెలుపబడుటకు పంపబడెను (6).
3. మరియ బంధువురాలు (5)
4. మరియ ఎలీసబెతు ఇంట గడిపిన కాలం నెలలలో (2)
5. విలువైనది/ జ్ఞానుల కానుక (4)

## పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక-4 జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 యా | 2 వ | త్తు | ■ | 3 రి | ■ | 4 ఓ | 5 మె | 6 రు |
| 7 అ | ర | ■ | 8 రా | పా | 9 క | ■ | 10 రు | చి |
| ■ | 11 కు | 12 రు | యి | ■ | 13 ర | 14 అ | హీ | ■ |
| 15 సా | ■ | ఎ | ■ | ■ | ■ | బీ | ■ | 16 సి |
| 17 మె | నే | నె | మె | ■ | 18 అ | లె | క్సం | ద్రు |
| హ్ | ■ | బె | ■ | ■ | ■ | మె | ■ | ల్ల |
| ■ | 19 జా | జ | 20 రి | ■ | 21 ల | కు | 22 అ | ■ |
| 23 సొ | ర | ■ | 24 సా | 25 మె | త | ■ | 26 రా | 27 పా |
| 28 మ్ము | స్త్రీ | రొ | ■ | ల్కీ | ■ | 29 యూ | బా | లు |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక -3**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. శ్రీమతి సంధ్యారాణి, ఒంగోలు
2. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
3. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
4. టి. సుదర్శన్, నంద్యాల
5. కె. లలితాబాయి, వైజాగ్
6. యం. భాగ్యవతి, వరంగల్